నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
ఆదివారం | ఏప్రిల్ 21, 2024 | www.navatelangana.com

సురేష్ షట్కర్‌ను గెలిపించి అభివృద్ధి చేసుకుందాం

- జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నా రెడ్డి మోహన్ రెడ్డి



నవతెలంగాణ-రామారెడ్డి

సురేష్ షెట్కార్‌ను జహీరాబాద్ ఎంపీగా కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నా రెడ్డి మోహన్ రెడ్డి కోరారు. ఎల్లారెడ్డి నియోజకవర్గ గ్రామాల మండల అధ్యక్షులు గొల్లపల్లి లక్ష్మ గౌడ్‌తో కలిసి శనివారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి సురేష్ షెట్కార్‌ను గెలిపించి, తెలంగాణ అభివృద్ధిని సాధించుకుందామని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తూర్పు రాజు, నామాల రవీందర్, పిప్పిరి గణేష్, సుబ్బయ్య, బి పేట నర్సింలు, రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల ఫలితాల్లో ప్రాథమిక పాఠశాల విద్యార్థుల ప్రభంజనం

నవతెలంగాణ-ముప్కాల్

మండలంలోని వేంపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు గురుకుల ఫలితాల్లో మెరిశారు. స్థానిక పాఠశాల నుంచి మొత్తం 31 మంది విద్యార్థులు గురుకుల పరీక్షలలో పాల్గొనగా అందుకుగాను 24 మంది విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి వివిధ గురుకులల్లో సీట్లు పొందినట్లు స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల అధ్యాపకులు అభినందించారు. గ్రామస్తులు సైతం పాఠశాల విద్యార్థుల ప్రతిభను అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మీ నారాయణ, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



వర్ష బీభత్సం

- ఈదురుగాలతో నేల వాలిన పంటలు
- వరి రైతుకు అపార నష్టం
- కల్లాల్లో తడిసిన వారి ధాన్యం
- రోడ్డుపై నేల కూలిన చెట్లు



ఈదురుగాలులకు రోడ్డుపై విరిగి పడిన చెట్టు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

కమ్మర్‌పల్లి మండలంలో శనివారం ఉదయం వర్షం బీభత్సం సృష్టించింది. సుమారు 40నిమిషాల పాటు బలమైన ఈదురు గాలులతో కురిసిన భారీ వర్షంతో పలు పంటలకు నష్టం వాటిల్లింది. పలుచోట్ల బలంగా వీచిన ఈదురు గాలులకు వరి, జొన్న, నువ్వు పంటలు నేల వాలాయి. వరి కోతలు కొనసాగుతున్నందున కల్లాల్లో ఆరబెట్టిన వరి ధాన్యం భారీ వర్షానికి తడిసిపోయింది. పలువురు రైతులు వరి ధాన్యాన్ని కాపాడుకునేందుకు ప్లాస్టిక్ కవర్లను కప్పి ఉంచినప్పటికీ ఈదురు గాలుల మూలంగా కవర్లు తొలగిపోవడంతో ధాన్యం తడవగా, మరికొందరు రైతులకు సంబంధించిన మరి దాన్ని ప్లాస్టిక్ కవర్లు ఉన్నప్పటికీ భారీ వర్షం మూలంగా అడుగు భాగంలో ఉన్న ధాన్యం తడిసింది. బలంగా వీచిన ఈదురు గాలులతో కూడిన వర్ష మూలంగా పలుచోట్ల చెట్లు వేర్లతో సహా, మరి కొన్ని చెట్ల కొమ్మలు విరిగి రోడ్డుకు అడ్డంగా పడ్డాయి. భారీ వర్షం, బలంగా వేచిన ఈదురుగాలుల మూలంగా వరి పంటకు పెద్ద ఎత్తున నష్టం వాటిల్లినట్లు రైతులు వాపోతున్నారు. కోతకు వచ్చిన వరి గింజలు నేలరాలడంతో రైతులు దిక్కుతోచని పరిస్థితుల్లో పడిపోయారు. చేతికొచ్చింది అనుకున్న పంట చెడగొట్టు వానల మూలంగా నేల పాలవ్వడంతో లక్షల్లో నష్టం వాటిల్లినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తడిసిన వరి ధాన్యం రంగు మారి, మొలకలు వస్తే కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధర లభించక ఇబ్బం దులు ఎదురవుతాయని రైతుల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అకాల వర్షాల మూలంగా నష్టపోయిన పంటలకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని రైతులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.



కమ్మర్‌పల్లి మండలంలో నేలవాలిన నువ్వు పంట

పొల్లు తప్ప గింజ లేదు



పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

- రైతులను ముంచిన నకిలీ విత్తనాలు
- మన గ్రోమోర్‌లో నకిలీ విత్తనాలు
- 500 ఎకరాల్లో పంట నష్టం
- చోద్యం చేస్తున్న అధికారులు
- నకిలీలకు అండగా నిలిచిన రాజకీయం



ఆందోళన చేస్తున్న రైతులు

నవతెలంగాణ-నసురుల్లాబాద్

ఆరుగాలం శ్రమించే అన్నదాతకు పుట్టెడు ఒడ్లు పండించేందుకు అడుగడుగునా అడ్డంకులే ఎదురవుతున్నాయి. ఒక వైపు ప్రకృతి ప్రకోపాటు మరోవైపు చీడపీడల బెడద ఉంటుండగా చివరికి పంట చేతికి వచ్చినా సకాలంలో కొనుగోలు చేయక నష్టపోయిన ఘటనలు కోకొల్లలు. వీటన్నింటి సమస్యలతో ఎదురీదుతుండగా.. నకిలీల బెడద ఏకంగా నిలువునా ముంచుతుంది. నకిలీ విత్తనాలు అంటగడుతుండటంతో రైతులకు మొదటికే మోసం వస్తుంది.

దుక్కులు దున్ని నాట్లు వేసిన నాటి నుండి పంట చేతికొచ్చే వరకు రైతన్న ఏదో ఒక రకంగా మోసపోతూనే ఉన్నాడు. రైతాంగ సంక్షేమం కోసం పెట్టుబడి సాయం చేస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం రైతులకు కావలసిన అసలు సహాయాన్ని చెయ్యలేక పోతుంది. నకిలీ విత్తనాలను అరికట్టలేకపోతోంది. అలాగే పండించిన పంటకు గిట్టుబాటు ధర అందించటంలో కూడా ప్రభుత్వం విఫలం అవుతోంది. ఫలితంగా అన్నదాతల కష్టాలు మాత్రం తీరడం లేదు.వందల సంఖ్యలో రైతాంగం నకిలీల బారిన పడి నష్టపోతున్నారు. తాజాగా కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండలంలో రైతులు నకిలీ విత్తనాలతో మోసపోయారు.

కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండలంలో నకిలీ విత్తనాల వల్ల యాసంగిలో వరి పంట దిగుబడి పడిపోయింది. బీర్కూర్, తిమ్మాపూర్, వెంకటయ్య క్యాంపు ఏరియాల్లో దాదాపు 450 ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లింది. బీర్కూర్ లోని గ్రోమోర్ సీడ్స్ షాపులో తాము అడిగిన విత్తనాలు కాకుండా ఆర్కే సోనా రకం సీడ్ ఇచ్చారని వాటిని నారు పోసి పంట వేయగా కోత దశలో దిగుబడి రాక పోవడంతో రైతులు ఆందోళన చెందారు. నాసిరకం విత్తనాలతోనే పంటకు పెట్టిన పెట్టుబడి కూడా రాలేకపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఎకరాకు రూ. 25 వేల నుంచి రూ.30 వేల వరకు పెట్టుబడి పెట్టామని ఇప్పుడు సీడ్ లోపంతో మూడు, నాలుగు క్వింటాళ్లు కూడా దిగుబడి రాలేదని అన్నదాతలు వాపోతున్నారు. తమకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. నిజామాబాద్ జిల్లా కోటగిరిలోని గ్రోమోర్ సైతం రైతులకు నకిలీ విత్తనాలు అంటగట్టడంతో పంట నష్టపోయారు.

సన్న రకం ఎకరాకు 28 క్వింటాళ్ల వరకు అవకాశం ఉండగా, నాసిరకం విత్తనాల లోపంతో ఎకరాకు మూడు, నాలుగు క్వింటాళ్లకు మించి దిగుబడి రావట్లేదని రైతులు వారి వ్యవసాయ అధికారుల ఎదుట గోడు వెళ్లబోసుకున్నారు. అయితే షాపులో తాము ఒక రకం సీడ్ అడిగితే మరో రకం ఇచ్చారని రైతులు వాపోయారు. వ్యవసాయ అధికారులకు తమకు జరిగిన నష్టాన్ని తెలియజేశారు. నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలంటూ రైతులు శుక్రవారం ఉదయం మన గ్రోమోర్ ఫర్టిలైజర్స్ దుకాణం కు తాళం వేసి షాపు ఎదుట రైతులు నిరసన వ్యక్తం చేశారు. తమకు నష్టపరిహారం ఇప్పించాలని డిమాండ్ చేశారు.

తమను నకిలీ విత్తనాలతో మోసం చేసిన కంపెనీపై చర్యలు చేపట్టాలని, తమకు నకిలీ విత్తనాలు అంటగట్టిన డిస్ట్రిబ్యూటర్ మీద పీడీ యాక్ట్ పెట్టాలని రైతులు ఆందోళన చేస్తు బీర్కూర్ పోలీసులకు బీర్కూరు తహసిల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. మండలంలోని వివిధ గ్రామాల్లో నకిలీ విత్తనాలతో నష్టపోయిన రైతులకు అండగా నిలవాల్సిన వ్యవసాయ అధికారులు నకిలీ విత్తనాలు సరఫరా చేసిన అధికారులు రాజకీయ నాయకులు కంపెనీలపై మొగ్గు చూపుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.

వ్యవసాయాధికారుల పంట పరిశీలన

నకిలీ విత్తనాల వల్ల పంట నష్టపోతున్నామని రైతులు వ్యవసాయాధికారులకు ఫిర్యాదు చెయ్యగా దీంతో శుక్రవారం సైంటిస్టులు, స్థానిక వ్యవసాయ అధికారులు పంట పొలాలను పరిశీలించారు. రుద్రారం, జగిత్యాల, కూనారం పరిశోధన కేంద్రాలకు చెందిన శాస్త్రవేత్తలు పొలాలను పరిశీలించి బాధిత రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. పూర్తి స్థాయి పరిశీలన తర్వాతే వరి పంటలో పొల్లు ఎందుకు ఎక్కువ వస్తుందో లోపం ఏంటో తెలిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

వరి లేదు అంత పొల్లె



తనకున్న ఎకరం పొలంతో పాటు మరో 12 ఎకరాల్లో కౌలు తీసుకొని వరిని సాగు చేశారు. కౌలు ఎకరానికి 9 క్వింటాళ్ల కాడికి మాట్లాడుకుని వరి సాగు చేస్తే మొత్తం పొల్లు వచ్చింది. ఎకరానికి దిగుబడి రెండు మూడు క్వింటాళ్ల ధాన్యం వెళ్ళదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మురళీకృష్ణ, బీర్కూర్ రైతు

చెప్పిన పెట్టుబడి రాలే



7 ఎకరాల్లో వరి సాగు, 35వేల వరకు పెట్టుబడి పొలం గింజ కట్టలేదు రెండు మూడు క్వింటాలు మాత్రమే ధాన్యం వస్తుంది. మేము బీర్కూరు గ్రోమోర్ సిబ్బంది నుంచి విత్తనాలు తీసుకున్నాం. గంగా కావేరి సీడ్ అడుగుతే వారు మాకు ఆర్కే సోనా అనే సీడ్‌ను ఇచ్చారు. మమ్మల్ని ప్రభుత్వం ఆదుకోవాలి మోసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి.

నర్సింలు బీర్కూర్ కౌలు రైతు

మూడవ రోజూ ఏడు నామినేషన్లు



నామినేషన్ వేస్తున్న అభ్యర్థి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

పార్లమెంటు ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా నిజామాబాద్ లోక్ సభ నియోజకవర్గానికి సంబంధించి మూడవ రోజైన శనివారం ఏడు (7) నామినేషన్లు దాఖలు అయ్యాయని రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. ఇప్పటికే స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేసిన రాగి అనిల్, విద్యార్థుల రాజకీయ పార్టీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన భూక్యా నందు, బహుజన్ ముక్తి పార్టీ అభ్యర్థిగా నామపత్రం అందజేసిన దేవతి శ్రీనివాస్ లు శనివారం సైతం రెండవ సెట్ నామినేషన్ పత్రాలు సమర్పించారని అన్నారు. అదేవిధంగా స్వతంత్ర అభ్యర్థులుగా ఆరే రవీందర్, గంట చరితా రావు, సయ్యద్ అస్గర్, మిర్యాల్కర్ జయప్రకాష్ నామినేషన్లు వేశారని వివరించారు. ఇప్పటివరకు మొత్తం 16 నామినేషన్లు దాఖలు అయ్యాయని రిటర్నింగ్ అధికారి రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు.

పిడుగుపాటుతో ఐదుగురికి గాయాలు

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని ధర్మోరా గ్రామ శివారులో వరి ధాన్యం అరబెడుతున్న సమయంలో పిడుగుపడటంతో ఐదుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ధర్మోరా గ్రామానికి చెందిన శివ, బన్నీ, నారాయణ, శంకర్, సుంకరి ధర్మన్న వడ్లు ఆరబెడుతుండగా వారిపై పిడుగు పడింది. దీంతో వారికి గాయాలయ్యాయి. బాధితులను వెంటనే చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. శివ, బన్నీ హనుమాన్ మాల ధరించారు. వారిద్దరికి బలమైన దెబ్బలు తగిలినట్లు స్థానికులు తెలిపారు. ప్రస్తుతం జిల్లా కేంద్ర ఆసుపత్రిలో వారు చికిత్స పొందుతున్నారు.ం



పిడుగుపాటుకు గురై చికిత్స పొందుతున్న బాధితులు

వడ్లు కొనే వారు లేరు

- దీనస్థితిలో మంచిప్ప రైతులు

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని మంచిప్ప గ్రామంలో రైతుల పరిస్థితి దయనీయంగా తయారైంది. తమ ధాన్యం కొనేవారు లేరని.. రోజులు గడుస్తున్న కొనుగోల్లు చేపట్టడం లేదని వాపోతున్నారు. మండలంలోని బాడ్సి సొసైటీ పరిధిలో ఏడు గ్రామాలున్నాయి. అందులో మంచిప్ప గ్రామమొకటి. అయితే తమ గ్రామంలో వడ్లను తూకం వేయడం లేదని.. ప్రస్తుతం వర్షాలు పడుతున్న నేపథ్యంలో ధాన్యం తడిసిపోతుందని.. మా బాధని చూడలేక చదువుకునే మా పిల్లలు సైతం నిత్యం పొద్దున నుంచి సాయంత్రం దాకా వడ్లకు కాపలా కాస్తున్నారని రైతులు అంటున్నారు. వర్షం ఎప్పుడు పడుతుందో.. ఎప్పుడు పడదో తెలియక అయోమయంతో వడ్ల దగ్గరే కాపలా కాయాల్సిన దుస్థితి నెలకొందని అంటున్నారు. వరి ధాన్యం కోసి 20 రోజులు గడుస్తున్నా తమ వడ్లను కొనుగోలు చేసే వారే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని లేకుంటే రైతులందరం కలిసి ధర్నా చేపడతామని రైతులు హెచ్చరించారు.



తడిసిపోయిన వడ్లను చూపుతున్న రైతు

ఆగని వలసలు

- ఖాళీ అవుతున్న కారు
- కాంగ్రెస్‌లో భారీగా చేరికలు
- నేతల బుజ్జగించినా ఫలితం శూన్యం

నవతెలంగాణ-లింగంపేట్

పార్లమెంట్ ఎన్నికల సమీపిస్తున్న నేపథ్యంలో రోజురోజుకు బీఆర్ఎస్ పార్టీ ఖాళీ అవుతోంది. ఆ పార్టీ నుంచి ఇతర పార్టీల్లోకి ముఖ్యంగా కాంగ్రెస్‌లోకి వలసలు జోరుగా సాగుతున్నాయి. పెద్ద ఎత్తున నాయకులు పార్టీలు మారడంతో కారు పార్టీ ఖాళీ అవుతుంది.

పది సంవత్సరాలు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ అధికారం పోవడంతో బీఆర్ఎస్ నేతల్లో కార్యకర్తల్లో నిరుత్సాహం నెలకొంది. దీంతో ఆ పార్టీకి చెందిన కొందరు నాయకులు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. మరి కొందరు ఏకంగ ఖండువాలు మారిచ ఇతర పార్టీల్లోకి చేరుతున్నారు. వలసలు విలువరించేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు జిల్లా స్థాయి సమావేశాలు నిర్వహించి కార్యకర్తలను బుజ్జగించినా ఫలితం లేకుండా పోతుంది.

జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్ పార్టీ నుంచి పార్లమెంట్ అభ్యర్థి సురేష్ షెట్కర్ బిజెపి పార్టీ నుంచి తాజా మాజా ఎంపీ బీబీ పటేల్ బి ఆర్ ఎస్ పార్టీ గాలి అనిల్ కుమార్ బరిలో ఉన్నారు. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్ బిజెపి పార్టీలు ప్రచారాన్ని వేగవంతం చేస్తున్నాయి. నియోజకవర్గాల వారిగా కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి కార్యకర్తలను బలోపేతం చేస్తూ గ్రామాల్లో ప్రచారాన్ని మొదలుపెట్టారు. ఇప్పటివరకు బీఆర్ఎస్ పార్టీ గ్రామాల్లో ప్రచారంలో వెనుకంజులో ఉంది ప్రచారం మొదలు పెట్టలేదు.

ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ కంచుకోట ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు ఆధ్వర్యంలో భారీగా చేరికలు కొనసాగుతున్నాయి. ప్రధాన కాంగ్రెస్ బిజెపి పార్టీలు చేరికలపై ఫోకస్‌పెట్టారు. గాంధారి తాజా మాజీ సర్పంచ్ మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ ప్రధాన అనుచరుడు దమ్మె సంజీవ్ ఆయన తోపాటు సహకార సంఘం జిల్లా డైరెక్టర్ సాయికుమార్ రాంపూర్ తాండ మాజీఎమ్మెల్యే ప్రధాన అనుచరుడు సుభాష్‌తో పాటు పలువురు సర్పంచులు ఎంపిటిసిలు ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీంతో గాంధారి మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీకి కోల్పోయిన దెబ్బ తగిలింది. మరోవైపు మాజీ మంత్రి నేరెళ్ల ఆంజనేయులు మాజీ జెడ్పిటిసి సభ్యుడు తానాజీ రావు తో పలువురు బిజెపి పార్టీలో చేరారు. వరుస క్రమంలో కాంగ్రెస్ బిజెపి పార్టీలో చేరడంతో వలసలను అరికట్టడంలో బిఆర్ఎస్ నాయకులు పూర్తిగా విఫలమవుతున్నారు. ఎల్లారెడ్డి మండలంలో ఇప్పటికే పలువురు సర్పంచులు ఎంపీటీసీలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. మరోవైపు మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ తో కాంగ్రెస్ పార్టీ మంతనాలు జరుపుతున్నట్లు సమాచారం. నాగిరెడ్డిపేట్ మండలంలో అందరూ నాయకులు హస్తం పార్టీలో చేరడానికి మొగ్గు చూపుతున్నారు. ఇప్పటికే పలువురు ఎంపిటిసిలు సర్పంచులు పార్టీలో చేరారు. ఎల్లారెడ్డి జెడ్పిటిసి సభ్యుడు ఉషా గౌడ్ బి ఆర్ ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. లింగంపేట్ మండలంలో ఇప్పటికే పలువురు ఎంపిటిసిలు సర్పంచులు కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. మరికొంతమంది కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఇప్పటికే వారితో మంతనాలు జరిపినట్లు తెలిసింది.

తాడ్వాయి మండల కేంద్రంలోని తాజా మాజీ సర్పంచ్ సంజీవ్‌తో పాటు పలువురు ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరారు. సదాశినగర్ మండలంలో చేరికలు కొనసాగుతూనే ఉన్నాయి. రామారెడ్డి రాజంపేట్ మండలంలో కాంగ్రెస్ బిజెపి పార్టీలో సర్పంచులు ఎంపీటీసీలు చేరుతున్నారు. లింగంపేట్ మండలం నుండి సర్పంచులు ఎంపీటీసీలు త్వరలో కాంగ్రెస్ పార్టీ బిజెపి పార్టీలో చేరడానికి జిల్లా స్థాయి నాయకులతో మంతనాలు జరిపినట్లు తెలిసింది. ఇదే జరిగితే కార్ పార్టీ లింగంపేట్ మండలంలో కాళీ అవుతుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో జోరుగా చేరికలు కొనసాగుతూ ఉండడంతో మరోవైపు కాంగ్రెస్ బిజెపి పార్టీలు పోటాపోటీగా ప్రచారం నిర్వహించడంతో రాజకీయం రసవతంగా కొనసాగుతుంది.



ఎమ్మెల్యే మదన్‌మోహన్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న పలువురు

జీవన్‌రెడ్డి చొరవతోనే గల్ఫ్ కార్మికుల సంక్షేమంపై కాంగ్రెస్ హామీ

- గల్ఫ్ సంఘాల ఐక్య వేదిక సమావేశం

నవతెలంగాణ-ఆర్మూర్

అసెంబ్లీ వేదికగా గల్ఫ్ కార్మికుల హక్కులకై పోరాడిన ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి చొరవతోనే సీఎం రేవంత్‌రెడ్డి గల్ఫ్ కార్మికుల సంక్షేమంపై పాలసీ ప్రకటించినట్లు గల్ఫ్ సంఘాల ఐక్య వేదిక సమావేశం అభిప్రాయపడింది. గల్ఫ్ సంఘాల ఐక్యవేదిక సమావేశం పట్టణంలోని ఎంఆర్ డబ్ల్యూఎఫ్ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. గల్ఫ్ కార్మిక సంక్షేమ బోర్డు ప్రకటనలకు స్వాగతం పలుకుతూ ప్రవాస భారతీయుల హక్కుల సంక్షేమ వేదిక , ఆధ్వర్యం లో అధ్యక్షులు కోటపాటి నరసింహ నాయుడు అధ్యక్షతన ఎమ్మె గ్రేడ్స్ వెల్ఫేర్ ఫోరం అధ్యక్షుడు మంద భీమ్ రెడ్డి, జగిత్యాల్ తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంఘాల అధ్యక్షుడు పోతుగంటి సాయందర్, నిర్మల్ జిల్లాలోని ఎం ఆర్ డబ్ల్యు ఎఫ్ మండల అధ్యక్షులు న్యాయ సహ సలహాదారుడు బాలయ్య పాల్గొన్నారు. గల్ఫ్ లో లేదా విదేశాలలో చనిపోయే కార్మికులకు తెలంగాణగా ప్రభుత్వం ద్వారా పరిహారం రూ, 5 లక్షలు చెల్లించగలమని కాంగ్రెస్ హామీ ఇవ్వడంపై చర్చించారు. గల్ఫ్‌లో పనిచేసి తిరిగి వచ్చిన వారికి పునరావసం కోసం చర్యలు చేపట్టి సెప్టెంబర్ 17 తేదీ లోపు ఎన్నారై లా సంక్షేమ బోర్డు ఏర్పాటు స్పష్టమైన హామీ ఇచ్చారని, ఇందుకు మూలకారకుడు అనేక సంవత్సరాలుగా అసెంబ్లీ వేదికగా గల్ఫ్ కార్మికుల హక్కులకై పోరాడినగా ఎమ్మెల్సీ టి జీవన్ రెడ్డి చొరవే ప్రధాన కారణంగా సమావేశం అభిప్రాయం పడింది. ఈ కార్యక్రమంలో భీంగల్ మండల అధ్యక్షులు సులేమాన్ రాజ్ ,నిజామాబాద్ పట్టణ అధ్యక్షులు మహమ్మద్ ఇబ్రహీం -, బాల్కొండ మండల అధ్యక్షులు మాట్లూరు మండల అధ్యక్షులుబీ మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కోటపాటి నరసింహనాయుడు

వడగళ్ల వానకు నష్టపోయిన పంటలు పరిశీలన


పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలో శుక్రవారం రాత్రి కురిసిన వడగండ్ల వానతో కూడిన రాళ్ల వర్షానికి దెబ్బతిన్న వరి పంటను మండల వ్యవసాయాధికారి పద్మ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా బోర్గం(కె), మాక్లూర్ గ్రామాల్లో రాళ్ల వర్షానికి వరి ధాన్యం రాలిపోయిన పంటలను పరిశీలించారు. మండలంలో ఎంత వరకు వరి ధాన్యం రాలిపోయిందో అంచనా వేసి ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి రంజిత్, రైతులు పాల్గొన్నారు.

వర్ని చౌరస్తా.. డేంజర్ జంక్షన్

- సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలంటున్న ప్రజలు


వర్ని చౌరస్తాలో లేని సూచికబోర్డులు

నవతెలంగాణ-వర్ని

వర్ని మండల కేంద్రంలోని సుభాష్ చంద్రబోస్ చౌరస్తా ప్రమాదాలకు అడ్డాగా మారింది. బాన్సువాడ, బోధన్, నిజామాబాద్ ఇతర ప్రాంతాలకు వెళ్లే బస్సులు, ఇతర వాహనాలు ఏవి ఎటువైపు వెళ్తున్నాయో అర్థంకాని పరిస్థితి నెలకొంది. కొన్ని సందర్భాల్లో ప్రమాదాలు సైతం చోటుచేసుకుంటున్నాయి. అధికారులు స్పందించి ఏ వాహనాలు ఎటువైపు వెళ్లాలో సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

యువత భక్తి మార్గాన్ని అలవర్చుకోవాలి

- ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి


భిక్ష కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థి

నవతెలంగాణ-బోధన్

యువకులు ఇప్పటి నుంచే భక్తి మార్గాన్ని అలవర్చుకోవాలని బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరు సుదర్శన్‌రెడ్డి అన్నారు. శనివారం సాలూర మండలం కుమ్మన్‌పల్లి గ్రామంలో హనుమాన్ స్వాముల మండల భిక్ష కార్యక్రమానికి ఆయన హాజరై హనుమాన్ ఆలయాన్ని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదర్శ భావాలు కలిగి ఉత్తముడిగా పేరుపొందిన శ్రీరాముడికి నమ్మిన బంటుగా మెలిగిన హనుమంతుని విగ్రహం యువకులు ప్రతిష్ఠించడం అభినందనీయమని అన్నారు. హనుమాన్ భక్తులు, ప్రజలు సుఖశాంతులతో వర్ధిల్లాలని, వర్షాలు బాగా కురిసి రైతులు అభివృద్ధి చెందాలని అన్నారు. అనంతరం ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. శాంతి సౌభాగ్యాలు వెదజల్లేలా, హిందూ మత ప్రాప్తికి కృషి చేయాలని అన్నారు. భక్తులలో ఆత్మవిశ్వాసం నిండే విధంగా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. హనుమాన్ దీక్షపరులు భక్తిశ్రద్ధలతో చేస్తున్న కార్యక్రమాలను ఆయన అభినందించారు. కార్యక్రమంలో హనుమాన్ భక్తులు, మాజీ సర్పంచ్ గంగాధర్, గ్రామస్తులు పాల్గొన్నారు

ముత్యాల సునీల్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో భారీ చేరికలు


కాంగ్రెస్‌లో చేరుతున్న పలువురు

నవతెలంగాణ-ఏర్గట్ల

మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఓర్సు రాములు, బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో శనివారం చేరారు. ఆయనతో పాటు ఏర్గట్ల గ్రామానికి చెందిన కురాకుల ముదిరాజ్ సంఘం, ముదిరాజ్ బర్మ పెద్ద సంఘం, వడ్డెర సంఘాల సభ్యులు సుమారు 100 మంది శనివారం పార్టీలో చేరారు. వారికి ముత్యాల సునీల్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా పని చేయాలని సునీల్‌రెడ్డి వారిని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు సోమ దేవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు శివన్నోళ్ళ శివకుమార్, కిసాన్ ఖేత్ మండలాధ్యక్షులు ముస్కు మోహన్‌రెడ్డి, నాయకులు రెంప్ల రాజారెడ్డి, కల్లెడ పురుషోత్తం, బద్దం లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దళిత మోర్చా అధ్యక్షులు, గిరిజన మోర్చా ప్రధాన కార్యదర్శి నియామకం


నియామకపత్రాలను అందజేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని మదాపూర్ గ్రామంలో గల బిజెపి పార్టీ కార్యాలయంలో దళిత మోర్చా అధ్యక్షులుగా దామ రాజేశ్వర్, గిరిజన మోర్చా ప్రధాన కార్యదర్శిగా వినోద్ నాయక్‌ను శనివారం నియమించారు. ఈ మేరకు నియామకపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు సురేష్ నాయక్ పాల్గొన్నారు.

బెదిరింపు రాజకీయాలు మానుకోవాలి

- బిజెపి మండలాధ్యక్షులు సురేష్ నాయక్


మాట్లాడుతున్న సురేష్‌నాయక్

నవతెలంగాణ-మాక్లూర్

బెదిరింపు రాజకీయాలు మానుకోవాలని బిజెపి మండల అధ్యక్షులు సురేష్ నాయక్ కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇంఛార్జి పి.వినయ్ కుమార్‌రెడ్డికి హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ పార్టీ కార్యకర్తలకు ఆర్మూర్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జి వినయ్‌రెడ్డి ఫోన్ చేసి మభ్య పెట్టడం సరికాదని, పార్టీ కార్యకర్తలు పార్టీ మారాలని చెప్పడం, బెదిరించే రాజకీయాలు మానుకోవాలని అన్నారు. బీజేపీ కార్యకర్తలు దేనికి లొంగబోరని, ఇకనైనా ఇలాంటి చర్యలు మానుకోవాలని కోరారు.

కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ రావడం ఖాయం

- నిజామాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి

నవతెలంగాణ-ఎడపల్లి/రెంజల్

రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కేంద్రంలోకి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని కాంగ్రెస్ పార్టీ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని వీఆర్ఆర్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళన సమావేశాన్ని ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డితో పాటు పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినట్టే కేంద్రంలో కూడా పార్టీ అధికారంలోకి వచ్చి రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేయడమే లక్ష్యమన్నారు. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలు పక్కగా అమలవుతాయని ఆయన గుర్తు చేశారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరను తెలంగాణ ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. బోధన్ చక్కెర కర్మాగారాన్ని, సారంగాపూర్‌లో గల ఎన్సీఎస్ఎఫ్ పునరుద్ధరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోబోతుందని ఆయన గుర్తు చేశారు. ఈ నెల 24న ఎంపీ అభ్యర్థిగా తాను నామినేషన్ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలిరావాలని ఆయన కోరారు. అనంతరం బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలన కుంటుపడిందని ఆయన గుర్తు చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ పాలనలో ప్రజలు విసుగు చెందారని తెలిపారు. ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలి పించుకుందామని ఆయన కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీ పథకాలపై బూత్ కమిటీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటా ప్రచారం చేయాల్సిన అవసరం ఉందన్నారు.


ఎడపల్లి : మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి


రెంజల్ : కాంగ్రెస్‌లో చేరుతున్న పలువురు

సమావేశంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హుందాన్, జెడ్పి ఉపాధ్యక్షురాలు రజితా ఎల్లయ్య యాదవ్, ఎస్ఎస్ఎల్ జిల్లా అధ్యక్షులు ఏరంటి లింగం, ఎడపల్లి జైతాపూర్ సహకార సంఘాల అధ్యక్షులు పోల మల్కారెడ్డి, కారాటూరి సత్యనారాయణ, తాజా మాజీ సర్పంచులు పాల భాస్కర్‌రెడ్డి, రామ్ గోపాల్‌రెడ్డి, అమానుల్లా షరీఫ్, నాయకులు గాంధారి హనుమంత్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, పోచమ్మల శ్రీనివాస్‌గౌడ్ మండలంలోని కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిక..

మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం అధ్యక్షులు ఆత్మల శ్రీనివాస్ శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. మండల కేంద్రంలోని వీఆర్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన మండల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి హాజరైన కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి జీవన్ రెడ్డి, ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి సమక్షంలో ఆత్మల శ్రీనివాస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు పులి శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు బిల్లా రామ్మోహన్, ఎడపల్లి కాంగ్రెస్ పార్టీ మండల కోశాధికారి బొబ్బిలి శ్రీనివాస్, మచ్చుకూరి గంగాధర్, శంకర్ నాయుడు, నాయుడు పోతన్న, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. అంతకుముందుగా ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డికి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి, ఎడపల్లి మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు ఘనంగా సన్మానించి పూలబోకెను అందజేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వ సారథ్యంలోనే ప్రజాపాలన..

రెంజల్ : కాంగ్రెస్ ప్రభుత్వం సారథ్యంలోని ప్రజలకు స్వేచ్ఛాయుతమైన ప్రజా పాలన అందుతుందని మాజీ మంత్రి, బోధన్ శాసనసభ్యులు ప్రొద్దుటూరు సుదర్శన్‌రెడ్డి స్పష్టం చేశారు. శనివారం కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత పది సంవత్సరాల కాలంలో కెసిఆర్ అవినీతి పాలన చేశారని, పనికిరాని ప్రాజెక్టులతో కోట్ల రూపాయలను కూడగట్టుకున్నారని ఆయన విమర్శించారు. నాటి నుంచి నేటి వరకు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ప్రజలకు సంక్షేమ ఫలాలు అందాయని ఆయన అన్నారు. గత ఎన్నికలు పసుపు బోర్డు తెస్తానని అబద్ధాలు ఆడిన అరవింద్ ఈ ఎన్నికల్లో ప్రజలు చిత్తుగా ఓడిస్తారని, ఆయన స్పష్టం చేశారు. త్వరలోనే నిజాంసూగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణకు కృషి చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షపాతి అని, గతంలో కందకుర్తి ఎత్తిపోతల పథకానికి 14 కోట్ల రూపాయల వ్యయంతో శాశ్వత స్టీల్ పైపులతో మరమ్మతు పనులను చేపట్టినట్లు ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. త్వరలోనే రైతులకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. రైతులకు అదనంగా 500 రూపాయల బోనస్ కూడా ప్రకటించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. రాబోవు పార్లమెంట్ ఎన్నికల్లో జీవన్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలుపొందించుకోవాలని ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు మొబిన్ ఖాన్, మాజీ జెడ్పిటిసి నాగభూషణంరెడ్డి, జి.సాయిరెడ్డి, సాయిబాబా గౌడ్, ధనుంజయ్, జావిద్ ఉద్దీన్, సిహెచ్ రాములు, సురేందర్ గౌడ్, బాబన్న, గయాస్ ఉద్దీన్, కార్తిక్, రవి, ఎమ్మెల్ రాజు, గోసుల గంగా కిషన్, జంగం గంగాధర్, వై. శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లోకి ఎంపీటీసీ..

మండలంలోని నీలా ఎంపిటిసి గడ్డం స్వప్న, మాజీ సర్పంచ్ రఘు, కాంగ్రెస్ పార్టీ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరారని ఆయన పేర్కొన్నారు. కలసికట్టుగా పనిచేస్తూ పార్లమెంటు సభ్యులు జీవన్ రెడ్డి అత్యధిక మెజార్టీతో గెలుపొందించాలని ఈ సందర్భంగా కార్యకర్తలకు ఆయన సూచించారు.

వచ్చేనెల 15 నుంచి ఆందోళనలు

- అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం



మాట్లాడుతున్న వి.ప్రభాకర్, బి.దేవారాం

నవతెలంగాణ-ఆర్మూర్

వ్యవసాయ ఉత్పత్తి, సాధనాలు మినీట్రాక్టర్స్.. అన్ని రకాల విత్తనాలపై 50శాతం సబ్సిడీ కొరకు వచ్చేనెల 15 నుంచి జూన్ మొదటి వారం వరకు అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళనకు పిలుపునిస్తున్నట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు వి.ప్రభాకర్, బి.దేవారం పిలుపునిచ్చారు. అఖిలభారత (ప్రగతిశీల రైతు సంఘం) తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని శుక్రవారం హైదరాబాద్‌లో సిపిఎంఎల్ మాస్‌లైన్ కార్యాలయంలో అధ్యక్షులు చంద్రశేఖర అధ్యక్షతన సమావేశం మాస్ లైన్ పార్టీ కార్యాలయం కుమార్ నారాయణ భవన్‌లో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న పసులపై చర్చించి ఆందోళనకు పిలుపునిచ్చినట్టు తెలిపారు. గత దశాబ్దం క్రితం వ్యవసాయ ఉత్పత్తి సాధనాలపైన, యంత్రాలపైన, ఎరువులకు, పురుగుమందులు.. రైతాంగానికి ఇన్పుట్ సబ్సిడీ ప్రభుత్వాలు ఇచ్చేవాని తెలిపారు. కానీ రైతాంగానికి పెద్దపీట వేస్తానని చెప్పిన కేసీఆర్ ప్రభుత్వం మొత్తం సబ్సిడీలను రద్దు చేసి సర్వరోగ నివారిణి రైతు బంధుగా చూయించి తీరని అన్యాయం చేశా రని మండిపడ్డారు. సబ్సిడీలను కొనసాగించాలని గుర్తు చేస్తూ ఆవేదన వ్యక్తం చేశారు. అదే సమయంలో లక్ష రూపాయలు ఏకకాలం రుణమాఫీ చేస్తానని చెప్పి దశలవారీగా వడ్డీలు మాత్రమే రద్దుచేసి, అసలు అలాగే మిగలడంతో నూతన అప్పులు బ్యాంకు ఇవ్వకపోవడంతో రైతులు ప్రైవేట్ వారిని ఆశ్రయించాల్సిన స్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో రెండులక్షల వరకు బాకీలు ఉన్నవారు ఎవరు చెల్లించకండా, తాము అధికారంలోకి రాగానే ఏకకాలంలో రద్దు చేస్తామని రేవంత్‌రెడ్డి వాగ్దానం చేయడమే కాకుండా తమ ఎన్నికల ప్రణాళికలో ప్రకటించారని, రుణాలు రద్దు చేయకపోవడంతో బ్యాంక్ అప్పులు మంజూరు కాక రైతులు నానా తిప్పలు పడాల్సిన స్థితి ఏర్పడిందని గుర్తు చేశారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో రైతాంగాన్ని ఎంపీ అరవిందు మోసం చేశాడని రైతాంగ శ్రేయస్సు కోసం అరవింద్‌ను.. బిజెపి ప్రభుత్వాన్ని ఓడించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా నాయకులు ఆకుల గంగారాం, యు.రాజన్న, టి. గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

గురుకులాలకు 12 మంది విద్యార్థులు ఎంపిక


గురుకులానికి ఎంపికైన విద్యార్థులు

నవతెలంగాణ-మోర్తాడ్

మండలంలోని దొనకల్ సరస్వతి విద్యానికేతన్ పాఠశాలకు చెందిన విద్యార్థులు 12 మంది గురుకుల సీట్లు సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ నాగేష్ తెలిపారు. ఐదో తరగతి అర్హత పరీక్షలకు నిర్వహించిన వాటిలో 12 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్ష రాసి ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. మండలంలోని అత్యధిక సీట్లు సాధించిన పాఠశాలగా సరస్వతి విద్యానికేతన్ స్థానం సంపాదించిందని అన్నారు. గురుకులాల నిర్వహణకు ప్రత్యేక తరగతులు విద్యార్థులకు నిర్వహించిన పాఠశాల ఉపాధ్యాయులు లత, సౌజన్య, లావణ్య, అశ్వినిలకు కృతజ్ఞతలు తెలిపారు. గురుకులలో సీటు సంపాదించిన విద్యార్థులకు అభినందిస్తూ తమ గ్రామ పేరును నిలబెట్టేలా మంచిగా చదువుకోవాలని తెలిపారు.

చెరువులో దూకి వివాహిత ఆత్మహత్య

నవతెలంగాణ-ఎడపల్లి

చెరువులో పడి వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మండలంలోని మంగల్‌పాడ్ చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పోలపల్లి ఇంద్రజ (40) స్థానిక గ్రామ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపిన ప్రకారం.. అప్పుల బాధతో ఇంద్రజ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. భర్త దూలపల్లి అశోక్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సీఐటీయూ మండలాధ్యక్షులు ఆంజనేయులుకు నాయకుల పరామర్శ


బాధితుడిని పరామర్శిస్తున్న నాయకులు

నవతెలంగాణ-నవీపేట్

గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) మండల అధ్యక్షులు మేకల ఆంజనేయులుకు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రమేష్‌బాబు, నాయక్‌వాడి శ్రీనివాస్, గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జంగం గంగాధర్ శనివారం ఆయన నివాసంలో కలిసి పరామర్శించారు. మేకల ఆంజనేయులు పెద్ద కుమారుడు రాజు ప్రమాదవశాత్తు మృతి చెందడంతో ఆయనను పరామర్శించి సిఐటియు కార్మిక సంఘం ద్వారా అన్ని విధాలుగా సహకరిస్తామని తెలిపారు. అంతకుముందు వడదెబ్బతో మృతి చెందిన ర్యాగళ్ల లావణ్య భర్త రాజశేఖర్‌ను పరామర్శించారు. ప్రభుత్వం తరపున నష్టపరిహారం విషయంలో జిల్లా అధికారులతో సంప్రదించి అన్ని విధాలుగా సహకరిస్తామని తెలిపారు. ప్రభుత్వం ఉపాధి హామీ కూలీలకు సౌకర్యాల కల్పనలో నిర్లక్ష్యం వహించడం సరికాదని ఇప్పటికైనా సౌకర్యాలను కల్పించాలని కోరారు.

అధికారంలో ఉన్నప్పుడు ఏం చేశారు..?

- దొంగ దీక్షలతో మొసలి కన్నీళ్లు..
- నష్టపోయిన వారిని ఆదుకుంటాం
- సుడిగాలి పర్యటన చేసిన ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి


ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, రాష్ట్రంలోని బి.ఆర్.ఎస్ ప్రభుత్వం రైతులకు ఎలాంటి లబ్ధి చేకూర్చకుండా నల్ల చట్టాలను తీసుకువచ్చి వేలాదిమంది రైతుల ప్రాణాలు బలి తీసుకుందని, నేడు రైతులపై కపట ప్రేమ చుయిస్తూ మొసలి కన్నీరు కారుస్తూ దొంగ దీక్షలు చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి విమర్శించారు. నల్ల చట్టాలు చేసిన తర్వాత రైతుల ఆందోళన నేపథ్యంలో ఆ చట్టాలను వెనక్కు తీసుకున్నారని అప్పటికే వేలాదిమంది రైతులు ప్రాణాలు పోయాయని తెలిపారు. అలాంటి వారు కాంగ్రెస్ పార్టీని విమర్శించడం మానుకోవాలని ఆయన హెచ్చరించారు. శుక్రవారం డిచ్‌పల్లి మండలంలోని దూస్‌గాం, ఇందల్‌వాయి మండలంలోని ఇందల్‌వాయి, ఇందల్‌వాయి తండా, గండి తండా, సామ్య నాయక్ తండా, గన్నారంతోపాటు ఇతర గ్రామాల్లో కురిసిన ఆకల వర్షాలకు నష్టపోయిన పంట పొలాలను, నివాస గృహాలను, ధాన్యం కొనుగోలు కేంద్రాలను, విద్యుత్ లైన్లను తదితర వాటిని శనివారం సుడిగాలి పర్యటన చేసి పరిశీలించారు. ఈ సందర్భంగా నష్టపోయిన



బాధితులకు కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని, ఎలాంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదని భరోసా కల్పించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఆగస్టు 15 లోపు రెండు లక్షల లోపు రుణాలున్న రైతులకు రుణమాఫీ చేస్తామని, ఇదే కాకుండా వరి ధాన్యానికి క్వింటాకు రూ.500ల బోనస్ కూడా వచ్చే పంట నుంచి అందజేస్తామని ఆయన అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పంట బీమా చేయకపోవడంతో నేడు ఈ పరిస్థితులు దాపురించాయని అన్నారు. వరి ధాన్యాన్ని ప్రభుత్వం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తుందని రైతన్నలు ఎలాంటి ఆందోళన, దిగులు చెందవద్దని సూచించారు. గత ప్రభుత్వ హయాంలో దళారులదే రాజ్యం నడిచిందన్నారు. అడ్డు అదుపు లేకుండా ఇష్టానుసారంగా ఒక సంచి వెంట పది నుంచి పదిహేను కిలోలు కటింగ్ చేస్తూ కింది నుంచి పై స్థాయి వరకు కమీషన్లు పొందారని, కానీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈసారి ఇలా చేస్తే అలాంటి వారిని గుర్తించి క్రిమినల్ కేసులు నమోదు చేయడమే కాకుండా రైస్ మిల్లులను సీజ్ చేస్తామని హెచ్చరించారని దానిలో భాగంగానే ఈసారి ఒక్క కిలో కూడా వరి ధాన్యాన్ని కటింగ్ చేయకుండా జాగ్రత్తలు చేపట్టామన్నారు. ఎమ్మెల్యే వెంట మాజీ ఐడిసిఎంఎస్ చైర్మన్ మునిపల్లి సాయరెడ్డి, పిసిసి డెలిగేట్ శేఖర్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ముప్ప గంగారెడ్డి, ఇందల్‌వాయి, డిచ్‌పల్లి మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోత్కురి నవీన్‌గౌడ్, అమృతపూర్ గంగాధర్, సహకార సొసైటీ చైర్మన్ చింతలపల్లి గోవర్ధన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మారుతి, డిసిసి డెలిగేట్ వెంకట్‌రెడ్డి, సుధాకర్, సిహెచ్.దాస్, మోహన్‌రెడ్డి, చింత శ్రీనివాస్‌రెడ్డి, విఠల్ రాథోడ్, ధర్మగౌడ్, మాజీ ఉప సర్పంచ్ బైరయ్య, బద్దంరెడ్డి, దశరథ్, రతన్, సుధాకర్, మహిపాల్, సిఈఓ రతన్, డైరెక్టర్లు, మండల నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

బీభత్సం సృష్టించిన ఈదురు గాలులు



ఈదురు గాలులకు నెలకొరిగిన చెట్లు

నవతెలంగాణ-మెండోరా

మండలంలో శనివారం ఉదయం వర్షంతో కూడిన ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. తద్వారా పంటలు నష్టాలకు గురయ్యాయి. ఈదురు గాలులకు ప్రధాన రహదారులపై చెట్లు విరిగి పడిపోయాయి. నువ్వు , పంట పొలాలు నేలకొరిగాయి. కొన్ని పంటలు పొట్టకొచ్చిన స్థాయిలో ఉండగా ఇంకొన్ని పంటలు పొట్టకు రాకముందే విరిగి పడిపోవడంతో పూర్తిగా పంట నష్టం కలిగే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

కాంగ్రెస్‌లో చేరిన పలువురు నాయకులు



కాంగ్రెస్‌లో పలువురు చేరిక

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని జంగంపల్లి గ్రామంలోని ఇతర పార్టీలకు చెందిన 200 మంది నాయకులు మాజీ సర్పంచ్ నర్సింలు యాదవ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్, ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ షబ్బీర్ అలీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికలలో నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేసి కాంగ్రెస్ పార్టీ గెలుపు కొరకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టి పి సి సి రాష్ట్ర కార్యదర్శి ఇంద్రకరణ్ రెడ్డి, డిసిసి ఉపాధ్యక్షులు చంద్రకాంత్ రెడ్డి, ఎంపీపీ గాల్ రెడ్డి, మండల అధ్యక్షులు భీమ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపిద్దాం

- రాష్ట్రంలో అధికారంలోకి వచ్చాం.. దేశంలో అధికారంలోకి వస్తాం
- ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ

నవతెలంగాణ-కామారెడ్డి

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపిద్దామని ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల సన్నాహక కార్యకర్తల సమావేశాన్ని బీబీపేట్ మండల కేంద్రంలో ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్, జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి సురేష్ షెట్కార్, డిసిసి అధ్యక్షులు కైలాశ్రీనివాసరావు, ప్రముఖ వ్యాపారవేత్త వేణుగోపాల్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ ఎన్నికల తర్వాత ఆగస్టు మాసంలో కాంగ్రెస్ పార్టీ రుణమాఫీని అందిస్తుందని, అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతుల డాటా మా వద్ద ఉందని, ఎన్నికలు కాగానే రైతుల అకౌంట్లో డబ్బులు వేస్తామన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు కష్టపడి కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాలని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతులకు, ప్రజలకు



మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ

చేసిందేమి లేదని పేర్కొన్నారు. గత ఎన్నికల సమయంలో బీజేపీ నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి నేటి వరకు కల్పించలేదన్నారు. కేంద్రంలో అధికారంలోకి వస్తే పాంచ్ న్యాయ్, 25 గ్యారంటీలు అమలు చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఐదు గ్యారంటీలను అమలు చేశామన్నారు. కాంగ్రెస్ పార్టీ ఐదు న్యాయ స్తంభాలపై దృష్టి సారిస్తుందనీ, ఈ స్తంభాలలో యువ న్యాయ్, నారీ న్యాయ్, కిసాన్ న్యాయ్, శ్రామిక్ న్యాయ్, హిస్సేదారి న్యాయ్ ఉన్నాయంన్నారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టో యువతకు ఉపాధి హక్కు, హామీని ఇస్తుందని, పరీక్షలలో పేపర్ లీక్‌లకు కఠినమైన శిక్షను ప్రతిపాదిస్తుందన్నారు. అదనంగా ఇది కనీస మద్దతు ధర, కుల ఆధారిత జనాభా గణన, సమాజంలోని అట్టడుగు వర్గాలకు సంక్షేమ చర్యల కోసం చట్టపరమైన హామీని తప్పకుండా అమలు చేస్తుందన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పారని, అదే విధంగా పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని పేర్కొన్నారు. జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షెట్కార్‌ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు ప్రతి కార్యకర్త సైనికుల్లా కృషి చేయాలని పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత కామారెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి పూర్తిస్థాయిలో కృషి చేస్తానన్నారు. అనంతరం సురేష్ షెట్కార్ మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీకి ఓటు ఎందుకు వేయాలంటే బీజేపీ అన్ని రంగాల్లో విఫలమైందన్నారు. ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ఇవ్వలేదన్నారు.

నల్లధనాన్ని వెనక్కి రప్పించడంలో విఫలమైందన్నారు. అదానీ అంబానీ లాంటి క్రోనీ క్యాపిటలిస్టులను పెంచి పోషించిందన్నారు. న్యాయవ్యవస్థకు ఆటంకం కలిగించడం, ప్రజాస్వామ్యాన్ని నిరంకుశత్వం నియంతృత్వంతో పాలించడం, రాజకీయాలను నేరస్థులు, రేపిస్టులు ఇంకా అవినీతి నేతలతో నింపడం, బిజెపి చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో ప్రకటించిన అన్ని పథకాలను అమలు చేస్తుందని, అందర్నీ సమానంగా చూస్తుందని, సుపరిపాలన అందిస్తుందన్నారు. ప్రజలు వీటిని దృష్టిలో ఉంచుకొని కాంగ్రెస్ పార్టీకి ఓటేయాలని తెలిపారు. కార్యక్రమంలో బిబిపేట మండలాధ్యక్షుడు సుతార్ రమేష్, వివిధ గ్రామాల తాజా మాజీ సర్పంచులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలయంలో వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం ప్రాజెక్టు ఆవరణలో ఏర్పాటు చేసిన గంగమ్మ విగ్రహ ప్రతిష్ఠలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్‌రావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోచారం ప్రాజెక్టు ఆవరణలో గంగమ్మ ఉండడంతో పోచారం ప్రాజెక్టు ఎప్పటికీ కూడా ఎండిపోకుండా సస్యశామలంగా ఉంటుందని ఆయన అన్నారు. గత 100 సంవత్సరాలుగా పోచారం ప్రాజెక్టు ఎన్నడూ కూడా పూర్తిగా ఎండిపోలేదని ఆయన అన్నారు. పోచారం ప్రాజెక్టును నమ్ముకున్న గంగపత్రులకు అన్ని రకాలుగా ఆదుకుంటానని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీధర్ గౌడ్ గ్రామ మాజీ సర్పంచ్ విజితా రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు రామచంద్రారెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు షాహిద్ పాష్, మత్స్యశాఖ డైరెక్టర్ సాయిలు, వాసు రెడ్డి బోయిని విటల్, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు కిరణ్, దివిటికిష్టయ్య, ఇమామ్, లక్ష్మణ్, గులాము హుస్సేన్, మధు, హైమద్ తో పాటు కాంగ్రెస్ నాయకులు మత్స్య కారులు పాల్గొన్నారు.

కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయాలి

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని రెడ్డిపేటలో నేడు జరగనున్న కామారెడ్డి నియోజకవర్గ రామారెడ్డి మండల గ్రామాల కాంగ్రెస్ కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయాలని జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నా రెడ్డి మోహన్ రెడ్డి, ఇన్చార్జి అధ్యక్షులు మద్దికుంట నర్సా గౌడ్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ పాల్గొననున్నందున ఆయా గ్రామాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని కోరారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ తోడుదొంగలు

- రెండు లక్షల రుణమాఫీ అంటూ రైతులను మోసం
- బీజేపీ నాయకులు ఈటల రాజేందర్



మాట్లాడుతున్న ఈటల రాజేందర్

నవతెలంగాణ-ఎల్లారెడ్డి (లింగంపేట్)

కాంగ్రెస్, బీఆర్ఎస్ తోడుదొంగలు అని, రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తామని మోసం చేశాయని బీజేపీ మల్కాజ్‌గిరి అభ్యర్థి ఈటల రాజేందర్ విమర్శించారు. శనివారం ఎల్లారెడ్డి పట్టణంలోని ముత్యపు రాఘవులు ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అంతకుముందు బైక్ ర్యాలీ నిర్వహించారు. కేసీఆర్ అహంకారం తో సహచర మంత్రులను, నాయకులను, ప్రజలని మర్చిపోయాడని, దాని ఫలితమే ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు చిత్తుగా ఓడించారన్నారు. బీఆర్ఎస్‌కు ఓటు వేస్తే నష్టమే తప్ప, లాభం లేదని రాష్ట్రానికి ఒరిగేదేమి లేదని ఆయన మండిపడ్డారు. హామీల అమలులో కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యింది ఆయన ఆరోపించారు.

కాంగ్రెస్ పార్టీ ఎన్నికలు వచ్చినటువంటి హామీలను నెరవేర్చ లేదన్నారు. రెండు లక్షల రుణమాఫీ ఇస్తానని చెప్పిన రేవంత్ రెడ్డి రైతులను పూర్తిగా మోసం చేసాడు పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్తారన్నారు.17 సీట్లు గెలిపిస్తే రాహుల్ గాంధీ ప్రధాని అవుతారని అంటున్న రేవంత్ రెడ్డి కి చెప్తున్నా జీవితం లో ప్రధానిగా రాహుల్ అవ్వడం పగటి కలనే ఆయన అన్నారు.

బీఆర్ఎస్ పార్టీని ప్రజలు నమ్మరు

- బీజేపీ అభ్యర్థి అర్వింద్ డిపాజిట్ గల్లంతు
- కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి

నవతెలంగాణ-ముప్కాల్

వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని ప్రజలు నమ్మబోరని.. ఇక బీజేపీ అభ్యర్థి అర్వింద్ డిపాజిట్ గల్లంతవుతుందని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి విమర్శించారు. ఉమ్మడి బాల్కొండ మండల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని శనివారం మధ్యాహ్నం ముప్కాల్ మండల కేంద్రంలోని మణికంఠ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. మొదటగా ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి మాట్లాడిన అనంతరం ఎంపీ అభ్యర్థి టి.జీవన్ రెడ్డి మాట్లాడుతూ మరో మూడు వారాల్లో లోక్‌సభ పోలింగ్ జరగనున్న నేపథ్యంలో ప్రతి కార్యకర్త కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలన్నారు. నియోజకవర్గంలోని కమ్మర్‌పల్లి, బాల్కొండ, మెండోరా, ముప్కాల్ తదితర మండలాల నుంచి వివిధ పార్టీలకు



మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి

చెందిన నాయకులు, కార్యకర్తలు, ఆయా కులసంఘాల ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. సునీల్ రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు అన్వేష్ రెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మెన్ తాహెర్ బిన్ హందాన్, ముప్కాల్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మగ్గిడి ముత్యంరెడ్డి, ముస్కు మోహన్‌రెడ్డి, వేంపల్లి సొసైటీ చైర్మన్ జక్క రాజేశ్వర్, ముప్కాల్ మాజీ సర్పంచ్ కొమ్ముల శ్రీనివాస్, చందా రవి, బద్దం సాగర్‌రెడ్డి, జక్కు గంగారాం, ముత్యం రెడ్డి, ఏలేటి రాములు, పోల ప్రవీణ్, అబ్రార్, సందీప్ గుప్తా, సాజిత్, ఉమ్మడి మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు, యూత్ సభ్యులు, ఎస్సి, ఎస్టీ, బీసీ, మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌సి తీసుకున్న తర్వాత పోల్ ఎక్కాలి

- ఎస్సీ రమేష్ బాబు



మాట్లాడుతున్న ఎస్ఈ రమేష్‌బాబు

నవతెలంగాణ-లింగంపేట్

విద్యుత్ శాఖలో పనిచేసినటువంటి సిబ్బంది ముందస్తుగా ఎల్సీ తీసుకున్న తర్వాతనే మరమ్మతు కోసం పోల్ ఎక్కాలని విద్యుత్ శాఖ జిల్లా అధికారి రమేష్ బాబు అన్నారు. శనివారం రెండో రోజు ఎల్లారెడ్డి సబ్ డివిజన్ పరిధిలోని లింగంపేట్ మండల కేంద్రంలోని రైతు వేదికలో నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డి, లింగంపేట్, గాంధారి, శెట్టిపల్లి, సంగారెడ్డి, సర్వాపూర్ ఆరు సెక్షన్ల పరిధిలో ఏఈలకు విద్యుత్ సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ రమేష్ బాబు మాట్లాడుతూ 11 కె.వి సబ్ స్టేషన్ వద్ద పనిచేసేటప్పుడు ఎర్త్ రాడు కచ్చితంగా ఉపయోగించాలన్నారు. విద్యుత్‌లో అంతరాయం జరగకుండా జాగ్రత్తలు పాటించాలని ఎప్పటికప్పుడు పసిగట్టాలన్నారు. విద్యుత్ ప్రమాదం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి అన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించరాదన్నారు. ఈ సమావేశంలో టెక్నికల్ డిఈ వెంకట రంగయ్య, డిఈ గణేష్ ఏఇలు తిరుపతి సుదర్శన్ సత్యనారాయణ అశోక్ హరీష్ ధర్మేశ్వర్ ఆయా మండలాల ఏఈలు విద్యుత్ సిబ్బంది లైన్మెన్లు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు నిలిపివేయడంపై రైతుల ఆగ్రహం

- సొసైటీ కార్యదర్శి చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్

నవతెలంగాణ-నసురుల్లాబాద్

గత మూడు రోజుల నుంచి వాతావరణంలో మార్పులు రావడంతో ధాన్యం కోసిన రైతులు ఆందోళన చేస్తున్నారు. కోసిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు అధికారులు వేగవంతం చేయవలసి ఉండగా ప్రైవేటు దళారులకు కుమ్మక్కై గత మూడు రోజుల నుంచి ధాన్యం కాంటాలు నిలిపివేయడంతో రైతులు ఆందోళన చేస్తూ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసిన సంఘటన బీర్కూరు మండలంలో చోటుచేసుకుంది. ఒకవైపు ఆకాశం మేఘావృతమై కొన్ని చోట భారీ వర్షాలు కురుస్తూ, కోసిన ధాన్యాన్ని తడిపి వేస్తుంటే, మరొకపక్క చురుకుగా ధాన్యం కొనుగోలు వేగవంతం చేయవలసిన బీర్కూర్ సహకార సంఘం కార్యదర్శి విఠల్ గత రెండు రోజుల నుంచి ధాన్యం కొనుగోలు కాంటలను నిలిపివేయడం పట్ల రైతులు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.

శనివారం ఉదయం బీర్కూర్ సహకార సంఘంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బస్వరాజ్ పటేల్, చందు ఆధ్వర్యంలో రైతులను కలిసి, బీర్కూర్ సహకార సంఘం చేరుకొని కార్యదర్శి మిరుదొడ్డి విఠల్ పై తీవ్రంగా



అధికారులను నిలదీస్తున్న రైతులు

మండిపడ్డారు. ఒకవైపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుల వద్ద ఉన్న ప్రతి ఒక్క గింజలు కొనుగోలు చేస్తామని ప్రకటిస్తుంటే, సహకార సంఘంకు చెందిన కొంతమంది ఉద్దేశపురుకంగా ప్రైవేటు వ్యాపారస్తులతో కుమ్మక్కైయ్యారని ఆరోపిం చారు. ధాన్యం కాటాలు ఎందుకు నిలిపి వేశా రని రైతులు ప్రశ్నించారు. వర్షం కురుస్తుందనే భయంతో రైతులు ప్రైవేట్ వ్యాపారస్తులకు తక్కువ ధరలకు దాన్యం అమ్ముకోవాల్సిన పరిస్థితి, సహకార సంఘం సిబ్బంది చేస్తున్నారంటూ రైతులు నాయకులు ఆరోపించారు. అకాల వర్షాలు కురియడంతో రైతులు ఆందోళన చెందుతూ ఎండబెట్టిన ధాన్యమును రాశులుగా చేసి ధాన్యం కొనుగోలు కాంటల కొరకు రైతులు ఎదురుచూస్తున్నారు.

అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లనే ధాన్యం కాంటాలు నిలిపివేశారు అంటూ రైతులు తహసిల్దార్ ముందు ఆవేదన వ్యక్తం చేశారు. సహకార సంఘం కార్యదర్శిని విఠల్‌ను పిలిపించారు. ధాన్యం కంటలు ఎందుకు నిలిపివేశారు అంటూ కార్యదర్శిని తాహసిల్దార్ నిలదీశారు. వెంటనే ధాన్యం కొనుగోలు కాంటలు ప్రారంభించాలని ఏదైనా పొరపాటు చేస్తే తగు చర్యలు ఉంటాయని తాహసిల్దార్ హెచ్చరించారు. ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలని తాహసిల్దార్ రైతులకు సూచించారు.

పగిలిన మిషన్ భగీరథ పైపు

- నీళ్లు వృథా

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండలంలోని భవానిపేట్ రోడ్డు సమీపంలో శనివారం ఎల్లారెడ్డి కామారెడ్డి ప్రధాన రహదారి పక్కన గల మిషన్ భగీరథ పైప్‌లైన్ పగిలిపోవడంతో నీరు ఎగిసిపడుతూ వృథాగా పోతున్నాయని స్థానికులు తెలిపారు. ఒకవైపు ఎండలు తీవ్రమై తాగునీటి ఎద్దడి సమస్య తీవ్రంగా ఉండడంతో మరోవైపు మిషన్ భగీరథ పైప్లైన్ సామర్థ్యానికి మించిన నీరు వదలడంతో ఒత్తిడి పెరిగి జాయింట్ వద్ద పైపులైన్ పగిలిందని దీంతో నీరు ఎగిసిపడు తుందన్నారు. అధికారులు స్పందించి మరమ్మతు పనులు చేపట్టాలని సూచించారు.

లైంగిక వేధింపుల బాధితులకు..

- నష్ట పరిహారం చెక్కులు పంపిణీ



బాధితులకు చెక్కు అందజేత

నవతెలంగాణ-కామారెడ్డి

లైంగిక వేధింపుల బాధితులకు నష్టపరిహారం చెక్కులను జిల్లా జడ్జి శ్రీదేవి చేతుల మీదుగా శనివారం అందజేశారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కామారెడ్డి ఆధ్వర్యంలో జిల్లా జడ్జి, చైర్ పర్సన్ ఎస్ . ఎన్. శ్రీదేవి చేతుల మీదుగా లైంగికంగా వేధింపబడ్డ బాలికలకు నష్ట పరిహారం కింద 3,00,000, 2,00,000 ఫిక్స్ డిపాజిట్ చెక్కులను బాధితులకు పంపిణీ చేయరు. వివరాలకు వెళితే సుప్రీం కోర్ట్ ఆదేశాను సారం సెక్షన్ 357 ఏ బాధితుల పరిహారం కింద పిల్లలపై లైంగిక వేధింపులు పి ఓ సి ఎస్ ఓ చట్టం కింద నమోదైన కేసులకు ఈ పరిహారం కింద నష్ట పరిహారాన్ని జాతీయ న్యాయసేవాధికార సంస్థ ఆదేశానుసారం బాధితులకి అందజేశారు. ఈ కార్యక్రమంలో మొదటి తరగతి అడిషనల్ జిల్లా జడ్జి శ్రీ లాల్ సింగ్ నాయక్ , సీనియర్ సివిల్ జడ్జ్, జిల్లా న్యాయసేవాధికారి సంస్థ కార్యదర్శి టి. నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

గల్ఫ్ కార్మికుల ప్రకటనపై ఎన్నారైల హర్షం

నవతెలంగాణ-రామారెడ్డి

గత ప్రభుత్వం గల్ఫ్ కార్మికులను అన్ని విధాల ఆదుకుంటామని, ప్రత్యేక నిధులు కేటాయిస్తామని చెప్పి మోసం చేసిందని, కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో, గల్ఫ్ కార్మికులకు బీమా, ఎన్నారైల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని గత బుధవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించడంపై గల్ఫ్ కార్మిక సంక్షేమ సంఘం రామారెడ్డి మండల అధ్యక్షులు బండ సురేందర్ రెడ్డి హర్షం వ్యక్తం చేస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

గురుకుల పరీక్షలో 15మంది విద్యార్థులు ఎంపిక

నవతెలంగాణ-భిక్కనూర్

రాజంపేట్ మండలంలోని శివాయిపల్లి గ్రామంలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నుండి 4వ తరగతి చదువుతున్న 21 మంది విద్యార్థులు 5వ తరగతి గురుకుల ప్రవేశానికి పరీక్షలు రాయగా 15 మంది విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ఉపాధ్యాయులు స్వామి తెలిపారు. విద్యార్థుల ఎంపిక పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులను అభినందిస్తూ, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఎట్టకేలకు అడ్డదారిపై నిఘా

- రాత్రి వేళల్లో తనిఖీలు
- పన్నులు విధిస్తున్నారా.. జేబులు నింపుకుంటున్నారా.?
- అక్రమ రవాణాలో రాత్రిపూట ఏం జరుగుతుందో
- వాణిజ్య పన్నుల శాఖ తనిఖీలతో పన్ను రాబట్టడం ఎక్కడ

నవతెలంగాణ-మద్నూర్

అసలు పన్నులు విధిస్తున్నారా లేక అధికారులు జేబులు నింపుకుంటూ ఖాళీగా వదిలేస్తున్నారా.. దానిపై మండల ప్రజల్లో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



తనిఖీలు చేపడుతున్న దృశ్యం

అడ్డదారిని అడ్డుకట్ట వేయాలని పలుమార్లు నవతెలంగాణ దినపత్రికలలో ప్రచురితమైన వార్తలకు అధికారులు స్పందించినట్లు సమాచారం. బుధవారం రాత్రి మద్నూర్ మండల కేంద్రానికి దాదాపు మూడు కిలోమీటర్ల దూరంలో మహారాష్ట్రకు అడ్డదారి సమీపంలో వాణిజ్య పన్నులశాఖ ఆకస్మిక తనిఖీలు చేపట్టినట్లు రాత్రి వేళల్లో తనిఖీల ఫోటోలను బట్టి తెలుస్తోంది. మండల కేంద్రం నుంచి పెద్ద తడగూర్ రహదారి గుండా అక్రమ రవాణా జరిపే వాహనా లకు, రాత్రి వేళల్లో ఏమి జరుగుతుందనేది ప్రజలకు తెలియని పరిస్థితి, తనిఖీలు జరుపుతున్నట్లు రాత్రి వేళల్లో ఈ రహదారి గుండా వెళ్లే ప్రజలకు కనబడుతున్న దృశ్యాలు వాణిజ్య పన్నులశాఖ అక్రమ అడ్డదారి గుండా వెళ్లే వాహనాలకు పన్ను రాబట్టడంలో ఏమి జరుగుతుందోనని ప్రజల్లో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

పత్రికల్లో వచ్చే శీర్షికలకు అధికారులు ఈ అడ్డదారిగుండా రాత్రి వేళల్లో ఆకస్మిక తనిఖీలు చేస్తున్నట్లు ప్రజల సమాచారం బట్టి తెలుస్తోంది. అధికారులు పన్ను విధించినట్లు ఏ ఒక్కరికి తెలియపరచకపోవడం అసలు పన్నులు వసూలు అవుతున్నాయా లేక అధికారుల జేబులు నిండుతున్నాయా అనేది మండల ప్రజల్లో ఆవేదన వ్యక్తం అవుతుంది. ఈ తనిఖీలలో మండల కేంద్రానికి చెందిన వ్యక్తులు కూడా ఉంటున్నట్లు సమాచారం. ఇలాంటి తనిఖీల పట్ల జిల్లా ఉన్నతాధికారులు పకడ్బందీ నిఘా పెట్టవలసిన అవసరం ఎంతైనా ఉందని మండల ప్రజలు సూచిస్తున్నారు. తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వందల సంఖ్యలో అక్రమంగా అడ్డు దారి గుండా వెళ్లే వాహనాలకు అడ్డుకట్ట వెయ్యవలసిన అవసరం ఎంతైనా ఉంది.

నవతెలంగాణ
నిజామాబాద్
ఆదివారం | ఏప్రిల్ 21, 2024 | www.navatelangana.com

180 ఎకరాల్లో పంట నష్టం

● వ్యవసాయ అధికారి

నవతెలంగాణ-నిజామాబాద్‌రూరల్

శుక్రవారం కురిసిన అకాల వర్షానికి నిజామాబాద్ రూరల్ మండలంలోని జలాల్పూర్, కాలుర్, తిరుమలపల్లి, ఖానాపూర్ గ్రామాలలో వ్యవసాయ క్షేత్రాలను జిల్లా వ్యవసాయ అధికారి వాజీద్ హుస్సేన్, మండల వ్యవసాయ అధికారి హీరా జాదవ్, ఏఈఓ స్వాతిలత సందర్శించారు. ఈ సందర్భంగా సుమారు 180 ఎకరాల వరకు కోతకు వచ్చిన పంట పొలాలకు నష్టం వాటిల్లిందని తెలిపారు.


పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి

నాగపూర్ విద్యార్థి గురుకులానికి ఎంపిక

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని నాగపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన బసిరి భవజ్ఞ మెండోరా మండలం పోచంపాడ్ బాలికల గురుకుల పాఠశాలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాసం శ్రీనివాస్ గౌడ్ శనివారం తెలిపారు. ఐదవ తరగతిలో ప్రవేశానికి గాను నిర్వహించిన గురుకుల టెస్టులో ప్రతిభ కనబరిచిన భవజ్ఞ పోచంపాడ్ బాలికల గురుకులానికి ఎంపికైనట్లు ఆయన తెలిపారు. పాఠశాల నుంచి గురుకుల పాఠశాలకు విద్యార్థిని ఎంపిక అవ్వడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. గురుకుల పాఠశాలలో సీటు సంపాదించిన విద్యార్థిని భవజ్ఞను పాఠశాల తరఫున అభినందించారు.



పంట కొనుగోలు కేంద్రాలను వేగవంతం చేయాలి

● తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేష్

నవతెలంగాణ-కంఠేశ్వర్

పంట కొనుగోలు కేంద్రాలను వేగవంతం చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేష్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని నాందేవ్‌వాడ రైతు సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ఆరుగాలం కష్టపడి పంట పండించి కొనుగోలు కేంద్రాల వద్దకు తెచ్చినప్పటికినీ అకాల వర్షాల వల్ల చేతికొచ్చిన పంట నాశనం కాకుండా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను వేగవంతం చేయాలని అన్నారు. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో పంటలు కోసి కొనుగోలు కేంద్రాలు తీసుకొస్తున్నప్పటికీ కొనుగోళ్లలో కాలయాపన జరుగుతుందని తెలిపారు. సాధారణ ఎన్నికల ఉండడం వలన అధికారులు ముందస్తుగా కొనుగోలు కేంద్రాలపై దృష్టి సారించి హమాలీలు, లారీల సమస్య లేకుండా పంట వెంటనే రైస్‌మిల్‌కు తరలించే విధంగా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం కురిసిన వడగళ్ల వానకు ధర్పల్లి మండలంలో పంట కొట్టుకుపోయి రోడ్డుపై మట్టిపాలయ్యిందని అన్నారు.



మట్లాడుతున్న రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేష్

ఇప్పటికే అకాల వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులందరికీ ఎకరానికి రూ.20000 చొప్పున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. యాసంగి పంటకు ఇబ్బందులు లేకుండా అధికారులు కొనుగోలు కేంద్రాలు పెంచి రైతుల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. బిజెపి ప్రభుత్వం రైతుల పట్ల ఎనలేని ప్రేమను చూపిస్తూ రైతుల నడ్డి విరిచే విధంగా కొత్త చట్టాలను తీసుకొస్తూ కార్పొరేట్ పెట్టుబడిదారులకు వ్యవసాయరంగాన్ని అప్పనంగా అప్పజెప్పాలని చూస్తుందని అన్నారు. ఆ కోణంలోనే మూడు వ్యవసాయ నల్లచట్టాలు తీసుకొచ్చి అమలు చేస్తుందని అన్నారు. నిజాంబాద్ ఎంపీ అరవింద్ పసుపు బోర్డు 100 రోజుల్లో తెస్తానని రైతులకు వంద రూపాయల బాండ్ పేపర్‌పై రాసి ఇచ్చి ఇప్పటివరకు తేలేకపోయి పైగా ఏ ముఖం పెట్టుకొని ఓట్లు అడుగుతారని అన్నారు. రైతులను మోసం చేయటానికి ఓట్ల అడగటానికి వస్తున్నారని అన్నారు. రైతుల గురించి పట్టించుకోని బిజెపి ప్రభుత్వానికి ఓట్లు వేయొద్దని పిలుపునిచ్చారు. ఎంఎస్‌పి మద్దతు ధర ఇవ్వకుండా, రైతు పోరాటాన్ని అణచి వేయాలని చూస్తుందని అన్నారు. రైతులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని, రాత పూర్వక హామీని అమలు చేయాలని అన్నారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు దేవేందర్ సింగ్, కమిటీ సభ్యులు మురళి, లక్ష్మీ పాల్గొన్నారు

ఘనంగా కాంగ్రెస్ నాయకుడి జన్మదిన వేడుకలు


శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న పలువురు

నవతెలంగాణ-ఎడపల్లి

కాంగ్రెస్ పార్టీ మండల కోశాధికారి బొబ్బిలి శ్రీనివాస్ 44వ జన్మదిన వేడుకలను పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని విఆర్ఆర్ గార్డెన్‌లో బొబ్బిలి శ్రీనివాస్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి ఆయనకు కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాలలు వేసి స్వీట్లు పంపిణీ చేశారు. బొబ్బిలి శ్రీనివాస్ భవిష్యత్తులో ఎన్నో జన్మదిన శుభాకాంక్షలు కుటుంబ సభ్యుల మధ్యన జరుపుకోవాలని నాయకులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో జడ్పీ ఉపాధ్యక్షురాలు రజిత ఎల్లయ్య యాదవ్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు పులి శ్రీనివాస్‌రావు, జిల్లా ఉపాధ్యక్షులు బిల్లా రామ్మోహన్, ఐరన్ల నవీన్, తాజా మాజీ సర్పంచ్ పాల్దా భాస్కర్‌రెడ్డి, ఎడపల్లి, జైతాపూర్ గ్రామాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల అధ్యక్షులు పోల మల్కారెడ్డి, కరటూరి సత్యనారాయణ, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు ఈరెంటి లింగం, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గురుకులానికి ఎంపికైన లిటిల్ ఫ్లవర్ విద్యార్థులు



విజయకేతనం చూపుతున్న గురుకులానికి ఎంపికైన విద్యార్థులు

నవతెలంగాణ-మెండోరా

టిజి సెట్ ఐదవ తరగతి పరీక్షలో పోచంపాడ్ లిటిల్ ఫ్లవర్ పాఠశాల 30 మంది విద్యార్థులు ఎంపికైనట్టు పాఠశాల కరస్పాండెంట్ సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పోచంపాడ్ లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో నాల్గవ తరగతి చదువుతున్న విద్యార్థులు ఫిబ్రవరి 11న జరిగిన టీజీ సెట్ ఐదవ తరగతి ప్రవేశానికి 35 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా అందులో శుక్రవారం విడుదలైన ఫలితాలలో 30 మంది విద్యార్థులు విజయం సాధించి గురుకుల పాఠశాలల్లో సీటు సాధించినట్లు తెలిపారు. విద్యార్థులు గురుకుల పాఠశాలలకు ఎంపిక కావడంతో తల్లిదండ్రులు ఆనందాలను వ్యక్తం చేశారు. విజయం సాధించిన విద్యార్థులకు పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం అభినందనలు తెలియజేశారు. ఇలాగే తమ విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించి ముందుకు సాగాలని ఆశీస్సులు అందించారు.

ప్రశాంతంగా బి.ఎడ్. సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు

● ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆర్మూర్‌లో ఒకరు డిబార్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో బి.ఎడ్.మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు మూడవ రోజు ప్రశాంతంగా జరిగాయి. శనివారం జరిగిన పరీక్షలకు 1311 మంది విద్యార్థులకు 1257 మంది విద్యార్థులు హాజరయ్యారు. 54 మంది గైర్హాజరయ్యారు. మాల్‌ప్రాక్టీస్ 01 ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆర్మూర్‌లో నమోదైంది.

బి.ఎడ్ పరీక్ష కేంద్రాలు..

గిరిరాజ్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ నిజామాబాద్, ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల కామారెడ్డి, ఎస్ఆర్ఎన్‌కే ప్రభుత్వ డిగ్రీ కాళాశాల బాన్సువాడ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆర్మూర్, ప్రభుత్వ డిగ్రీ కాళాశాల బోధన్ సెంటర్‌లలో పరీక్షలు నిర్వహించనున్నట్టు ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు.

దెబ్బతిన్న ఇండ్ల పరిశీలన

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని అమీర్‌నగర్, ఇనాయత్‌నగర్ సర్పంచ్ తండాలో శుక్రవారం రాత్రి వీచిన బలమైన ఈదురు గాలులకు, వర్షానికి దెబ్బతిన్న ఇండ్లను తహసీల్దార్ ఆంజనేయులు ఆదేశాల మేరకు రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ శరత్ శనివారం సందర్శించి పరిశీలించారు. బలంగా వీచిన ఈదురుగాలులకు రెండు గ్రామాల్లో పలు ఇండ్ల పైకప్పు రేకులు కొట్టుకుపోగా, నివాస గుడిసెలు నేల కులాయి. ఆ ఇండ్లను రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శరత్ కుమార్ పరిశీలించి నష్టం అంచనా వివరాల నివేదికను తహసీల్దార్‌కు అందజేసినట్లు ఆయన తెలిపారు. అమీర్‌నగర్‌లో 4ఇండ్లు, 2 గుడిసెలు, ఇనాయత్‌నగర్ సర్పంచ్ తండాలో 4 ఇండ్లకు పాక్షికంగా నష్టం వాటిల్లినట్లు ఆయన వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

● ఎదురుగా వచ్చిన బైక్ ఢీకొట్టడంతో ఘటన

నవతెలంగాణ-నిజాంసాగర్

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని వెలగనూరు గ్రామానికి చెందిన కయ్యం సాయిరెడ్డి (38) వెలగనూర్ గ్రామం నుంచి తన ద్విచక్ర వాహనంపై మాసాన్‌పల్లి వెళుతుండగా మాసాన్‌పల్లి గేటు వద్ద ఎదురుగా వస్తున్న బైకు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సాయిరెడ్డిని బైక్‌తో ఢీకొట్టిన వ్యక్తి తప్పించుకొని పారిపోయాడు. కాగా మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. సాయిరెడ్డి మృతి తెలియడంతో గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి.

నవీపేట్ మేకల సంతలో ఆంధ్ర గొర్రెల పెంపకం దారులపై దాడులు

● అధిక ధరలకు కొంటున్నారని ఆరే కటికే వ్యాపారస్తుల దౌర్జన్యం

● గొర్రెలు లాక్కొని వేధించిన వైనం

● పోలీసులకు ఫిర్యాదు

● ఆకలితో అలమటించి జీవాల మృతి

నవతెలంగాణ-నవీపేట్

అధిక ధరలకు గొర్రె పొట్టేళ్లను కొనుగోలు చేస్తున్నారని నిజామాబాద్ జిల్లా ఆరే కటికే వ్యాపారస్తులు ఆంధ్ర గొర్రెల పెంపకం దారులపై దౌర్జన్యం చేశారు. మండల కేంద్రంలో శనివారం మేకల సంతకు ఆంధ్ర ప్రాంతం నెల్లూరు జిల్లా కావలి నియోజకవర్గం నుంచి వచ్చిన 15 మంది గొర్రెల పెంపకం దారులపై కటికే సంఘం సభ్యులు దాడి చేసి సుమారు 45 గొర్రె పొట్టేళ్లను దౌర్జన్యంగా ఎత్తుకెళ్లారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం గొల్ల కురుమలకు ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన గొర్రెల పథకంలో ఆంధ్రా ప్రాంతం నుంచి ఎక్కువ శాతం గొర్రెలు తెలంగాణకు రావడంతో అక్కడ గొర్రెలు, గొర్రె పొట్టేళ్ల సంఖ్య తగ్గడంతో గొర్రెల పెంపకం దారులు తెలంగాణలోని నవీపేట్, బాన్సువాడ, ఇచ్చోడ తదితర మేకల సంతలకు వచ్చి కొనుగోలు చేస్తున్నామని ఎక్కడ కూడా తమకు అభ్యంతరం లేదని కానీ నవీపేట్ మేకల సంతలో తమపై దౌర్జన్యంగా దాడులు చేసి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని గొర్రెల పెంపకం దారుడు రమేష్ వాపోయారు. ఉదయాన్నే పోలీసులకు సమాచారం ఇవ్వగా కొందరి సహకారంతో 29 గొర్రె పొట్టేళ్లను తిరిగి ఇచ్చిన 16 ఇవ్వకపోవడంతో బాసర మార్గంలోని మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ వద్ద సాయంత్రం వరకు వేచి చూడడం ఇచ్చిన జీవాలను బలవంతంగా వాహనాల్లో పడేయడం, ఆహారం లేకపోవడంతో ఒక గొర్రె పొట్టేలు మృతిచెందగా మరికొన్ని అస్వస్థతకు గురయ్యాయని తాము తీవ్రంగా నష్టపోయామని దుర్గయ్య వాపోయారు. ఈ విషయమై కార్యదర్శి రవీందర్ నాయక్ దృష్టికి తీసుకెళ్లగా పోలీసులకు సమాచారం చెప్పడంతో ఫిర్యాదు చేశామని వెంటనే దాడులు చేసిన వారిపై చర్యలు తీసుకొని తమకు రక్షణ కల్పిస్తేనే మేకల సంతకు వస్తామని దుర్గయ్య వాపోయారు. మేకల సంతలో ఇటువంటి అరాచకాలు తరచూ జరుగుతుండడంతో క్రయవిక్రయదారులకు రక్షణ లేకుండా పోతుందని కాబట్టి సంతలో పోలీసుల రక్షణతో పాటు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.


మాట్లాడుతున్న బాధితులు

ఆదినాధ స్వామి బ్రహ్మోత్సవాలు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండల కేంద్రంలో అధినాత స్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 19 నుంచి 25 వరకు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు ముసుకు సాయిరెడ్డి, బుస గంగారెడ్డి, చెంగల దేవదానం శుక్రవారం తెలిపారు.

బాల్య వివాహాలు, భ్రూణ హత్యలపై చిత్ర ప్రదర్శన


అవగాహన కల్పిస్తున్న అధికారులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని ఇనాయత్‌నగర్ గ్రామ పరిధిలోని సోమ్లానాయక్ తండాలో శనివారం బాల రక్షక్ భవన సిబ్బంది చిత్ర ప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ చిత్ర ప్రదర్శన ద్వారా బాలల హక్కులు, బాల్య వివాహ నిరోధక చట్టం, భ్రూణ హత్యలపై చిత్ర ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. బాలల హక్కులపై, మహిళ సాధికారత గురించి ప్రదర్శనకు హాజరైన మహిళలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ భీంగల్ ప్రాజెక్టు ఏసిడిపివో జ్ఞానేశ్వరి, ఐసిడిఎస్ మండల పర్యవేక్షకురాలు సరస్వతి, ఐసిపిఎస్ గణేష్, సిహెచ్ఎల్ పీసీ జోత్స్నా దేవి, పోలీస్ సిబ్బంది బీలేసింగ్, భానోత్ బాబు, మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ కవిత, అంగన్వాడీ టీచర్లు జమున, సుజాత, తండాలోని తల్లులు, తండా పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

సంకల్పంతో విజయాలు సాధించవచ్చు

● టీయూ రిజిస్ట్రార్ ఆచార్య యాదగిరి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రతి విద్యార్థి తమ జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించడానికి ఉత్తమ హోదాలను అందిపుచ్చుకోవడానికి, ఇందుకు సంకల్ప బలం ముఖ్యమని తెలంగాణ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య యాదగిరి పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని గిరిరాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య యాదగిరి హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. 'జీవితంలో విజయం సులువుగా రాదు.. నిరంతరం శ్రమించాల్సిందే. మన ఆలోచన బాగా ఉంటేనే మంచి ఫలితాలు అందుతాయి. మన చుట్టూ ఉన్న ప్రకృతి నుంచి.. సీనియర్స్, జూనియర్స్ అని తేడా లేకుండా అందరి నుంచి మంచిని నేర్చుకోవాల్సిందే. విజయాలు రాలేదని నిస్పృహకు లోను కాకుండా అన్నింటిని సానుకూలంగా తీసుకోవాలి' అని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన శాస్త్రీయ జానపద నృత్యాలు అలరించాయి. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంస పత్రాలు, పతకాలు, బహుమతులను రిజిస్ట్రార్ ఆచార్య యాదగిరి, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రామ్మోహన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ రఫీక్ అహ్మద్, డాక్టర్ వేణు, సాంస్కృతిక విభాగం సమన్వయకర్త డాక్టర్ అంబర్ సింగ్, డాక్టర్ భరత్ రాజ్, డాక్టర్ ఆదెప్ప, డాక్టర్ సత్య వరప్రసాద్, డాక్టర్ లక్ష్మీనారాయణ, పిడి బాలమణి, డాక్టర్ ప్రభాకర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు విద్యార్థులు హాజరయ్యారు.



ఎన్నికల తర్వాత టూరిజం పనులు

● ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్ రావు


పోచారం ప్రాజెక్టును సందర్శిస్తున్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

లోక్ సభ ఎన్నికల తర్వాత పోచారం ప్రాజెక్టు టూరిజం పనులు ప్రారంభిస్తామని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్ రావు స్పష్టం చేశారు. శనివారం పోచారం ప్రాజెక్టును ఆయన సందర్శించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పోచారం ప్రాజెక్టు టూరిజం పనులు లోక్‌సభ ఎన్నికల అనంతరం ప్రారంభిస్తామని ఇప్పటికే అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు. టూరిజం హబ్ గా పోచారం ప్రాజెక్టును అభివృద్ధి చేస్తామని ఆయన అన్నారు. పోచారం ప్రాజెక్టులో టూరిజం హబ్ ఏర్పాటు చేయడంతో ఇక్కడున్న స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న పోచారం ప్రాజెక్టుకు అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తామని ఆయన అన్నారు అతిథి గృహాలకు మరమ్మతులు చేసి సుందరంగా తీర్చిదిద్దుతా మన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీధర్ గౌడ్, రామచంద్రారెడ్డి షాహిద్ పాషా, బోయిని విటల్, వాసు రెడ్డి, దివిటికిష్టయ్య ఉన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

● జిల్లా అదనపు డిఆర్‌డిఓ మురళీకృష్ణ


మాట్లాడుతున్న జిల్లా అదనపు డిఆర్‌డిఓ మురళీకృష్ణ

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మహిళలు ఆర్థికంగా ఎదగాలని డి ఆర్ డి ఓ మురళీకృష్ణ అన్నారు. మండల కేంద్రంలో గల మండల సమాఖ్య కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల సమాఖ్య సమావేశంలో డి ఆర్ డి వో మురళీకృష్ణ మాట్లాడుతూ ... డ్వాక్రా మహిళలు ప్రభుత్వం ద్వారా అందిస్తున్న వడ్డీ లేని రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు. వ్యాపార అభివృద్ధి కార్యక్రమాల ద్వారా తమ ఆదాయాన్ని పెంచుకోవాలని ఆయన అన్నారు. ఆదాయ అభివృద్ధి కార్యక్రమాల ద్వారా మహిళలు ఆదాయాలను పెంచుకొని వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఏపీఎం జగదీష్, మండల సమాఖ్య అధ్యక్షురాలు శాంత, ఎంపీడీవో పర్వన్న జిల్లా బ్యాంకు లీకేజీ డీపీఎం రవీందర్రావు, వకుల తోపాటు సీసీలు దత్తు, నారాయణ, రమేష్, శ్రీనివాసరెడ్డి, సాయిలు సుజాత పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

నవతెలంగాణ-బాల్కొండ

మండల పోలీస్ స్టేషన్ పరిధిలో వివాహిత అదృశ్యమైంది. బాల్కొండ ఎస్సై కే గోపి వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ జిల్లా బజార్ హత్నూర్ మండల పరిధి లోని కండ్లి గ్రామానికి చెందిన పెంట రాంకిషన్ గత మూడు నెలల నుండి బాల్కొండ మండల పరిధిలోని బోదేపల్లి గ్రామంలో కూలి పని చేసుకుంటూ తన కుటుంబంతో జీవనం కొనసాగిస్తున్నాడు. అతని భార్య పెంట పోసాని (32) ఈనెల 19వ తేదీన ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదు. వెతికినా ఆచూకీ లభించకపో వడంతో భర్త పెంట రాంకిషన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎస్సై కే గోపి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



సైబర్ నేరగాళ్ల వేధింపులతో యువకుడు ఆత్మహత్య



నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని మగ్గిడి గ్రామానికి చెందిన మోతే నాగరాజు (19) అనే యువకుడు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి ప్రాణాలు కోల్పోయిన ఘటన శనివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మోతే భూమన్న యామాల చిన్న కొడుకు నాగరాజు జిల్లా కేంద్రంలోని డిగ్రీ పూర్తి చేశాడు. ప్లే స్టోర్లో తనకు తెలియని ఓ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవడంతో సైబర్ నేరగాళ్లు నేరుగా మృతుడు నాగరాజుకు ఫోన్ చేసి తనకు రూ.5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డబ్బులు ఇవ్వకుంటే కేసులు నమోదు చేస్తామని బురదీ కొట్టించే ప్రయత్నాలు చేస్తూ వేధించసాగారు. కాగా ఈ సైబర్ నేరగాళ్ల వేధింపులు భరించలేక ఈ యువకుడు ఇంటి వద్ద గత రెండు రోజుల కిందట గడ్డి మందు తాగి ఆత్మహత్యయత్నానికి ప్రయత్నించగా.. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి నాగరాజు శనివారం మృతి చెందాడు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

యువతి అదృశ్యం



నవతెలంగాణ-నిజంసాగర్

యువతి అదృశ్యమైంది. ఎస్ఐ సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మల్లూరు గ్రామానికి చెందిన కర్రోళ్ల హేమలత (19) అనే యువతి గత నెల 20న ఇంటి నుంచి వెళ్లింది. ఇప్పటివరకు తిరిగి రాలేదు. తండ్రి భూమయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చేతి గుర్తుకు ఓటు వేసి గెలిపించండి

● ఎమ్మెల్యే మదన్‌మోహన్

నవతెలంగాణ-సదాశివనగర్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే

చేతి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే మదన్‌మోహన్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా మండల కేంద్రంలోని నంది విగ్రహాన్ని దర్శించుకు న్నారు. అనంతరం ఉపాధి పనుల వద్ద ప్రచారం చేపట్టారు. జహీరాబాద్ ఎం.పి సురేష్ షెట్కర్‌కు ఓట్లు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఉపాధి కూలీలను కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో కొన్నింటిని ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చిందని అన్నారు. బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్ కాదు.. బిజినెస్ పాటిలని అన్నారు. నిధులు తేని ఎంపీ ఎందుకని ప్రశ్నించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జూకంటి సంగారెడ్డి, జిల్లా సేవాదల్ అధ్యక్షుడు బొంబోతుల లింగాగౌడ్, వైస్ ఎం.పి.పి గాదారి శ్రీనివాస్ రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఘద్దెల బాగయ్య, సంపత్‌గౌడ్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

బోరు మోటర్ ప్రారంభం

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్


బోరుమోటర్‌ను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నాగిరెడ్డిపేట్ మండల కేంద్రంలో శనివారం రోజు బోరు మోటర్ ప్రారంభించినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. తాగునీటికి ఇబ్బందిగా ఉండటంతో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్‌రావు దృష్టికి ఈ విషయం తీసుకెళ్లడంతో వెంటనే స్పందించిన ఎల్లారెడ్డి ఎమ్మెల్యే బోర్ మంజూరు చేసినట్టు తెలిపారు. శనివారం రోజు మోటార్ బిగించి నీటిని ప్రారంభించినట్లు కాంగ్రెస్ నాయకుడు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బోయిని విటల్, కాంగ్రెస్ నాయకులు లక్ష్మణ్, మన్నెవెంకటి, సాయ గౌడ్, హనుమండ్లు శ్రీనివాస్ గౌడ్ ,షకీల్, మన్నె మల్లేశం, కిషన్ ,నర్సింలు తోపాటు నాయకులు పాల్గొన్నారు.

వేడుకలకు తరలిరావాలి

నవతెలంగాణ-మద్నూర్


పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

మద్నూర్ మండల కేంద్రంలోని పురాతనమైన ప్రసిద్ధిగాంచిన గంగు శెట్టి హనుమాన్ ఆలయంలో మూడు రోజులపాటు నిర్వహించే ఉత్సవ వేడుకలకు గ్రామ భక్తులు ప్రజలు భారీ సంఖ్యలో తరలిరావాలని ఆలయ అభివృద్ధి కమిటీ నిర్వాహకులు శనివారం కోరారు. ఈనెల 21న ఆదివారం శిఖర స్థాపన నవగ్రహాలు పార్వతి దేవి సూర్య దేవుడు సందేశ్వర ప్రాణ ప్రతిష్టాపన కార్యక్రమాలు ఉంటాయని ఈనెల 22న సోమవారం మహా రుద్రాభిషేకం ఈనెల 23న పూర్ణ హూతి హనుమాన్ జన్మదిన జయంతి వేడుకలు పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్టు తెలిపారు. గ్రామస్తులు భక్తులు ఈ వేడుకలకు తరలిరావాలని ఆలయ అభివృద్ధి కమిటీ నిర్వాహకులు కోరారు.

జీరో దందా.. ఆపై దబాయింపు

- బాధితులను పీల్చిపిప్పి చేస్తున్న వడ్డీ వ్యాపారులు
- పోలీసుల తనిఖీల్లో అనేక అంశాలు వెలుగులోకి
- బడా బాబులను విస్మరించారని ఆరోపణ

నవతెలంగాణ-ఆర్మూర్

జిల్లాలోని సామాన్య, పేద, మధ్యతరగతి ప్రజలను పీల్చి పిప్పి చేస్తున్న వడ్డీ వ్యాపారులపై రాష్ట్ర వ్యాప్తంగా ఒక్కసారిగా దాడుల పరంపర కొనసాగించారు. జీరో దందా చేపడుతూ డబ్బులు తీసుకున్నవారిని బెదిరింపులకు గురి చేస్తూ అనేక వేధింపులకు గురి చేస్తున్నట్టు పోలీసుల తనిఖీల్లో వెలుగుజూశాయి. వడ్డీ వ్యాపారుల మీద ఫిర్యాదులు వస్తుండటంతోనే దాడులు చేపడుతున్నట్టు పోలీసులు పేర్కొంటున్నప్పటికీ.. ఎన్నడూ లేని విధంగా తాజాగా దాడులు చేయడంలో ఉన్న మర్మం ఏంటో అని ప్రజలు చర్చించుకుంటున్నారు. కాగా చిన్నచిన్న వడ్డీ వ్యాపారుల ఇండ్లల్లో, ఆఫీసుల్లో మాత్రమే తనిఖీలు చేశారని, బడా బబులను విస్మరించారని ఆరోపణల వ్యక్తమవుతున్నాయి.

ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి..

వడ్డీ వ్యాపారం చేసేవారు ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకొని, ఆర్బిఐ నిబంధనల ప్రకారం అప్పులను ఇవ్వాలి. ఈ నిబంధనలో ప్రకారమే వడ్డీని వసూలు చేయాలి. చట్టబద్ధంగా టాక్స్‌లను ప్రతేడాది చెల్లించాల్సి ఉంటుంది. జిల్లా పరిధిలో చేస్తున్న ఈ వడ్డీ వ్యాపారులు ఎక్కడ కూడా అనుమతులను తీసుకోవడం లేదు. అప్పులు ఇచ్చే సమయంలో తక్కువ వడ్డీ పేరు చెప్పి వారికి సంబంధించిన ఆస్తులను తనక పెట్టుకుంటున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు అయితే వారి ఏటీఎం కార్డులు, షూరిటీలు తీసుకుంటున్నారు

మూడు పువ్వులు ఆరు కాయలుగా..

గత కొన్ని సంవత్సరాల నుండి వడ్డీ వ్యాపారుల వేధింపులు ఎక్కువైనవి. అవసరాల కోసం అప్పులు తీసుకున్న వారి నుంచి నిబంధనలకు విరుద్ధంగా పెద్ద ఎత్తున వడ్డీ వసూలు చేస్తున్నట్టు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. కొంతమంది కట్టకపోతే వారి ఆస్తులను స్వాధీనం చేసుకుంటున్నారు. ఈ వ్యాపారం చేసేవారు ఎలాంటి అనుమతులు లేకుండానే కోట్ల రూపాయల వ్యాపారాన్ని నిర్వహిస్తున్నారు. లక్షల రూపాయలు అప్పులుగా ఇస్తున్నారు. వడ్డీలు అయితే రెండు నుండి నిర్ణీత సమయాలలో ఇవ్వనివారు నుండి పెద్ద మొత్తంలో వడ్డీలను పెంచుతూ ఎక్కువ మొత్తంలో వసూలు చేస్తున్నారు. కొంతమంది ఆస్తులను సైతం పోగొట్టుకోగా గత రెండు సంవత్సరాల క్రితం వడ్డీ వ్యాపారుల వేధింపులు తాళలేక ఒక కుటుంబానికి చెందిన నలుగురు విజయవాడకు వెళ్లి ఆత్మహత్య సైతం చేసుకున్నారు.

జక్రాన్‌పల్లి మండలంలోని పూప్పలపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి వడ్డీ వ్యాపారుల వేధింపులు తాళలేక ఒత్తిడికి గురై గుండెపోటుతో మరణించినాడు. జిల్లాలోని పలు డివిజన్ కేంద్రాలతో పాటు వ్యవసాయ రంగానికి పేరున్న ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాలలోని వడ్డీ వ్యాపారులు తమ సామ్రాజ్యాన్ని మూడు పువ్వులు ఆరు కాయలుగా విస్తరించుకున్నారు. పట్టణంలో వడ్డీ వ్యాపారుల సామాన్య దినసరి, చిరు వ్యాపారులకు వడ్డీలకు ఇస్తూ నరకయాతన చూపిస్తున్నారు. మరి కొంతమంది భూములను ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయించుకుని అప్పులు ఇస్తున్నారు. నిర్ణీత సమయంలో అప్పులు చెల్లించని వారికి చక్రవడ్డీ వేసి వసూలు చేస్తున్నారు. లక్షల రూపాయల టాక్స్‌లను ఎగ్గొడుతూ నిబంధనలకు విరుద్ధంగా వసూళ్లకు పాల్పడుతున్నారు. వీరిదంతా పెద్ద ఎత్తున ఉండడంతో చెల్లింపులు ఆలస్యం అయితే తమ అనుచరులను తీసుకువెళ్లి బెదిరించడం, ఆస్తులను తీసుకొని రావడం వంటి చర్యలకు పాల్పడుతున్నారు. రోజు రోజుకు పోలీస్ స్టేషన్లలో వడ్డీ వ్యాపారుల ఆగడాలపై ఫిర్యాదులు పెద్ద మొత్తంలో వస్తున్నవి. మనీ లాండరింగ్ చట్టం ప్రకారం పోలీసులు కేసులు నమోదు చేసిన డివిజన్ పరిధిలోని పలు గ్రామాలలో వడ్డీ వ్యాపారులు చాప కింద నీరులా వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. మరికొందరు ముందస్తు వ్యూహరచనతో గుట్టు చప్పుడు కాకుండా బంధువులు, తెలిసిన వారి ఇళ్లల్లో తల దాచుకుంటున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు కొందరు పార్ట్ టైం జాబ్ గా వ్యాపారం చేయడం గమనార్హం.

క్షేత్రస్థాయిలో పకడ్బందీ చర్యలు తీసుకోవాలి



జిల్లాలోని పలు డివిజన్లోని అనేక గ్రామాలలో వడ్డీ వ్యాపారుల ఆగడాలు రోజు రోజుకు పెరిగిపోతున్నవి. క్షేత్రస్థాయిలో పోలీస్ శాఖ స్పందించి పకడ్బందీ చర్యలు తీసుకోవాలి.

పల్లపు వెంకటేష్, తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి, ఆర్మూర్.

నిర్భయంగా ఫిర్యాదు చేయవచ్చు



జిల్లా సిపి ఆదేశానుసారం ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న వడ్డీ వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటాం. నిర్భయంగా ఫిర్యాదు చేయవచ్చు.

బస్వారెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్, ఆర్మూర్.

జుక్కల్ బస్టాండ్‌లో వ్యక్తి మృతి

నవతెలంగాణ-జుక్కల్



మండల కేంద్రంలోని ప్రయాణ ప్రాంగణంలో వ్యక్తి మృత దేహం లభ్యమైనట్టు జుక్కల్ ఎస్సై సత్యనారాయణ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన సాలే యాదు (45) గత కొంతకాలంగా అనారోగ్యంతో అంతుపట్టని వ్యాధితో బాధపడుతున్నాడు. సమస్య తీవ్రతరంగా ఉందని తెలిసినా జులాయిగా తిరిగేవాడు. శనివారం ఉదయం జుక్కల్ బస్టాండ్ వద్దకు వచ్చాడని , బస్టాండ్ లో కూర్చున్న చోటే అనుకోకుండా మృతిచెందాడని అప్పుడికి ఎవరు గుర్తు పట్టకుండా వ్యక్తి ఉన్నాడని తెలిపారు. ప్రయాణికులు ఉదయం గమనించగా.. తాగి పడుకున్నట్టు భావించారు. కానీ లేవకపోవడంతో పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కుటుంబీకులకు సమాచారం ఇచ్చినట్టు తెలిపారు.

ఆదిత్య హైస్కూల్‌పై ఫిర్యాదు

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలోని ఆదిత్య హైస్కూల్ పాఠశాల గుర్తింపు రద్దు చేసి వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం బోధన్ ఎంఈఓ కార్యాలయంలో వారు ఆదిత్య హైస్కూల్ పై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బోధన్ డివిజన్ అధ్యక్షులు నగేష్ మాట్లాడుతూ గురువారం రోజున ఆదిత్య హైస్కూల్ కు చెందిన బస్ డ్రైవర్ నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం వలన బస్సు రైలు వస్తున్నప్పుడు రైలుగేటు వేస్తున్న సందర్భంగా బస్సును నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తూ పట్టాలపైకి తీసుకొచ్చినట్టు తెలిపారు. ఆ సమయంలో జరగరాని ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. కావున నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శివా , పిరాజి తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన



వైద్య శిబిరంలో పాల్గొన్న పలువురు

నవతెలంగాణ-బోధన్

సాలూర మండలం సాలంపాడ్ క్యాంప్ గ్రామంలో శనివారం లయన్స్ క్లబ్ అయ్యప్ప సేవ, గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో క్యాన్సర్, మహిళ ఆరోగ్య సమస్యలు, కంటి పరీక్షలు , షుగర్ పరీక్షలు, ఎక్స్ రే, బీపీ పరీక్షలు నిర్వహించారు. అనంతరం రోగులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ సెక్రటరీ సూరాబత్తుని శ్రీనివాసరావు, జోనల్ చైర్మన్ మారం ఆదినారాయణ రెడ్డి , కోశాధికారి సురా బత్తుని ఆంథోని మేరీ , హనుమంతరావు , తన్నీరు సుబ్బారావు , ఎంపీటీసీ కె.వెంకట్రావు , ఎ.బాలకృష్ణ రెడ్డి , పోశెట్టి , లేళ్ల శైలజ , లిల్లీ కంటి వైద్యులు డాక్టర్ డి.సతీష్, డాక్టరు సూర్యప్రకాష్ , సాయి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు పరిశీలన


పెద్దఎడ్గిలో డెసిల్టింగ్ ఫీడర్ చాలన్‌ను పరిశీలిస్తున్న ఎంపిడీవో శ్రీనివాస్

నవతెలంగాణ-జుక్కల్

డేసిల్టింగ్ ఆఫ్ ఫీడర్ చాలన్‌ను జుక్కల్ ఎంపిడివో శ్రీనివాస్ శనివారం పెద్దఎడ్గి, పడంపల్లి గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పెద్ద ఎడ్గిలో జీపీ సెక్రటరీ రమేష్, ఎఫ్ఏ సుభాష్, ఉపాధీ కూలీలలతో పని చేస్తున్న ప్రదేశంలో ఎంపిడివో కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కొలతల ప్రకారం పనిచేసిన వారికి కూలీ రోజుకు మూడు వందల రూపాయలు చెల్లిస్తామని అన్నారు.

పని చేస్తున్న ప్రదేశంలో సౌకర్యాలు సమకూర్చాలని, ఎండలో పని చేయవద్దని, ఉగయం పూట తొందరగా వచ్చి చల్లటి వాతావరణంలో పనులు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడీవో తో పాటు పెద్ద ఎడ్గి జీపీ కార్యదర్శి రమేష్, ఎఫ్ఏ సుభాష్, పడంపల్లి ఎఫ్ఏ సూర్యకాంత్ తదితరులు పాల్గోన్నారు.

250 రోజులు ఉపాధి పని కల్పించాలి

నవతెలంగాణ-డిచ్‌పల్లి



మాట్లాడుతున్న సాయాగౌడ్

ప్రతి మనిషికి 250 రోజులకు పని దినాలు కల్పిం చాలని ఉపాధి కూలీలకు రోజువారి కూలీ 600 తగ్గ కుండా కూలి ఇవ్వాలని, ప్రతి వారం కూలి డబ్బులు చెల్లించాలని, పని ప్రదేశంలో టెంట్, నీటి సౌకర్యం, ప్రాథమిక చికిత్స పరికరాలు అందుబాటులో ఉంచాలని ఎఐపికెఎంఎస్ జిల్లా అధ్యక్షులు సాయి గౌడ్ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.శనివారం డిచ్‌పల్లి మండలంలో ఉపాధి హామీ కూలీలతో ఎఐపికెఎంఎస్ ఆధ్వర్యంలో ఉపాధి కూలీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు సాయ గౌడ్ మాట్లాడుతూ కొల తలు లేకుండా ప్రతి కూలికి 600 రూపాయలు ఇవ్వాల ని డిమాండ్ చేశారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం రోజువారి కూలీ 300కు తగ్గకుండా కూలి ఇస్తున్నామని ప్రకటించడమే తప్ప ఎక్కడ 300 కూలీ ఇచ్చిన దాఖలు లేవన్నారు. పని ప్రదేశంలో ప్రమా దవశాత్తు కూలీలు ఎవరైనా చనిపో తే 5 లక్షల రూపాయలు బీమా సౌకర్యం కల్పించాలని, జాబ్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి 250 రోజుల పని దినాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఐ ఎంఎల్ ప్రజా పంథా పార్టీ మండల కార్యదర్శి మురళి, పివైఎల్ జిల్లా అధ్యక్షులు సాయిబాబా ఎఐపికెఎంఎస్ జిల్లా నాయకులు మోహన్, మమత, బా లమణి, సుజాత, సాయిలు, విఠల్ ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

కార్యదర్శులు సమయపాలన పాటించాలి

- ఎంపీడీవో ప్రవీణ్ కుమార్


అధికారులకు సూచనలు చేస్తున్న ఎంపీడీవో

నవతెలంగాణ-భిక్కనూర్

పంచాయతీ కార్యదర్శులు సమయపాలన పాటించాలని గ్రామాలలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని ఇన్చార్జ్ ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ తెలిపారు. శనివారం మండలంలోని ర్యాగట్లపల్లి, గుర్జకుంటా, సిద్ధ రామేశ్వర నగర్, బస్వాపూర్ గ్రామాలలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామాలలో ఉన్న మంచినీటి ట్యాంకులను పరిశీలించి ట్యాంకులు శుభ్రంగా ఉంచాలని క్లోరేషన్, క్లీనింగ్ చేయాలని సిబ్బందికి సూచించారు. ఉపాధి హామీ పనులు జరుగుతున్న స్థలాలను పరిశీలించి కూలీలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, ఉపాధి కూలీల సంఖ్య పెంచి ప్రతి పేద కుటుంబానికి కూలీ కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామాలలో ఎక్కడైనా తాగునీరు వృథా చేస్తే చర్యలు తప్పవని, నీరు వృధా చేయకుండా ట్యాప్‌లు ఏర్పాటు చేయాలన్నారు. నర్సరీలోని మొక్కలను పరిశీలించి మొక్కలు ఎండిపోకుండా నీరు పోయాలని, బస్వాపూర్ గ్రామంలో వాటర్ పైప్ లైన్ మరమ్మత్తు పనులను పరిశీలించారు. అలాగే సిద్ధ రామేశ్వర నగర్ గ్రామంలోని అంగన్వాడి కేంద్రాన్ని, ప్రాథమిక పాఠశాలను, వాటర్ ట్యాంకులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది ఉన్నారు.

జిపి రికార్డులు పరిశీలించిన డిఎల్పిఓ

మండలంలోని బస్వాపూర్ గ్రామంలో గ్రామపంచాయతీ రికార్డులను డి ఎల్ పి ఓ శ్రీనివాస్ శనివారం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామంలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని, ఉపాధి కూలీల సంఖ్య పెంచాలని కార్యదర్శికు సూచించారు. ఈ పరిశీలనలో ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, కార్యదర్శి దయాకర్, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

మారుమూల గ్రామీణ విద్యార్థికి డాక్టరేట్


డాక్టరేట్ అందుకుంటున్న బాలాజీ

నవతెలంగాణ-జుక్కల్

మారుమూల జుక్కల్ మండలం లాడేగాం గ్రామానికి చెందిన సుర్నార్ బాలాజీ డాక్టరేట్ పట్టా పొందారు. గ్రామీణ ప్రాంతంలో విద్యనభ్యసించిన ఆన ఉస్మానియ యూనివర్సిటీలో పీజీ అయిన తరువాత యూనివర్సిటీలో హింది విభాగంలో సమకాలిన హింది "ఉపన్యాసమే మానవీయ మూల్య " అనే విషయం పై పీ హెచ్ డి పూర్తి చేశారు. మారుముల జుక్కల్ మండలంలోని గ్రామీణ ప్రాంతం నిరుపేద కుటుంబం నుండి వచ్చి డాక్టరేట్ (పీ హెచ్ డీ) సాధించడంపై గ్రామస్తులు తల్లిదండ్రులు , మిత్రులు అభినందించారు. మార్గదర్శకులుగా , సూపర్ వైజర్ గా డాక్టర్ అప్సరునిసా బేగం, హెచ్‌ఓడిగా ప్రొఫేసర్ మాయాదేవి, బివోఎస్ గా డాక్టర్ సంగీత వ్యాస్ పరిశోదనలో సహకారం అందించినట్టు తెలిపారు.

నిబంధనలు పాటించని
ప్రయివేటు డిగ్రీ కాలేజీలపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-డిచ్‌పల్లి



వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

తెలంగాణ యూనివర్సిటి పరిధిలో కనీస నిబంధనలు పాటించని, డెవలప్‌మెంట్ పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రయివేటు డిగ్రీ కాలేజీలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. జూనేర (నిజామాబాద్), నలంద(భీంగల్), ఉషోదయ (నిజామాబాద్), సిఎస్ఐ (నిజామా బాద్) , సక్సెస్ (ఆర్మూర్), విజేత (ఆర్మూర్), ఎస్ అర్‌కె (కామారెడ్డి), సాందీపని (కామారెడ్డి), శ్రీ ఆర్యభట్ట (కామారెడ్డి), వశిష్ఠ(ఆర్మూర్), మంజీరా(ఆర్మూర్) , విజ్ఞాన భారతి (కామారెడ్డి), శ్రీ సాయి (నందిపేట్), ప్రజ్ఞ(కామా రెడ్డి) కాలేజీలపై చర్యలు తీసుకోవాలని శనివారం తెలం గాణ యూనివర్సిటీ ఆడిట్ సెల్ డైరెక్టర్ చంద్రశేఖర్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పిడిఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ మాట్లాడుతూ విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తూ, ఫీ జులు కట్టనిచో ఎగ్జామ్ ఫీజు కట్టిం చుకోవడం లేదని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్ డబ్బులను కూడా కట్టించుకుంటున్నారని ఆరోపించా రు. పలు కాలేజీలకు స్వంత భవనా లు, ల్యాబ్ లు లేవని , అర్హతలు కలిగిన స్టాఫ్ లేనందున అధిక సం ఖ్యలో విద్యార్ధులు ఫెయిల్ అవుతు న్నారని అన్నారు. ఫైర్ గ్రౌండ్ సౌకర్యాలు లేకుండా కళాశాలలు నడుపుతున్నారని పలు కాలేజీలపై తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యూ నాయకులు దేవిక, రవీందర్, ప్రిన్స్,సాయి కృష్ణ, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

యూనివర్సిటీ పరిధిలో
పీజీ పరీక్షలు ప్రారంభం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో పీజీ పరీక్షలు శనివారం నుండి ప్రారంభమయ్యాయి.ఎంబీఏ, ఎంసీఏ, ఆరవ సెమిస్టర్ ఐ ఎం బి ఏ పదవ సెమిస్టరు మరియు ఎల్.ఎల్.బి. ఎల్ ఎల్ ఎం. ఒకటవ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు గిరిరాజ్ గవర్నమెంట్ డిగ్రీ కళాశాల, నిజామాబాద్, ప్రభుత్వ కళాశాల బోధన్. తెలంగాణ వర్సిటీ కళాశాల, తెలంగాణ వర్సిటీ న్యాయ కళాశాల సెంటర్ ల లో పరీక్షలు జరుగుతున్నట్టు అధికారులు తెలిపారు. ఈ పరీక్షలకు రాసే విద్యార్థుల సంఖ్య మొత్తం 574 కాగా 551 మంది విద్యార్థులు హాజరు కాగా 23 మంది విద్యార్థులు హాజరు కాలేదని పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ ఘంటా చంద్రశేఖర్ ఒక ప్రకటన లో తెలిపారు.

శిక్షణతో జీవితంలో వెలుగులు

- డీఆర్‌డీఏ పీడీ సాయాగౌడ్

నవతెలంగాణ-డిచ్‌పల్లి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ సాయాగౌడ్

శిక్షణతో మహిళలకు చాలా ఉపయోగకరంగా ఉంటుందని, ఇంట్లో ఉండి స్వతహాగానే చేసుకోవడానికి స్వంత కాళ్ళమీద నిలబడి ఎదగడానికి చాలా చక్కని అవకాశమని డీఆర్‌డీఏ సాయ గౌడ్ అన్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ అధ్వర్యంలో శనివారం మగ్గం శిక్షణా కార్యక్రమాన్ని ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా పీడీ సాయాగౌడ్ మాట్లాడుతూ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి సంస్థ అధ్వర్యంలో శిక్షణ చాలా నాణ్యతతో నేర్పించడం అభినందనీయమన్నారు. ఈ సంస్థలో నేర్చుకున్న ఎంతో మంది మహిళలు జీవితం లో వెలు గులు వచ్చాయని,వారు చక్కగా స్థిరపడ్డారని వివరించారు. ప్రస్తుతం మగ్గం వర్క్ లాంటి శిక్షణా మహిళలకు చాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఇంట్లో ఉండి చేసుకోవడానికి స్వంత కాళ్ళమీద నిలబడి ఎదగడానికి చాలా చక్కని అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం మగ్గం వర్క్ శిక్షణా కు మార్కెట్ లో మంచి డిమాండ్ ఉందని దానిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం లో సంస్థ డైరెక్టర్ సుంకం శ్రీనివాస్, సిబ్బంది భాగ్యలక్ష్మి, రామకృష్ణ, నవీన్, రంజిత్, ఫ్యాకల్టీ ఫరిద తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు, మరుగుదొడ్డి సదుపాయం కల్పించాలి

- అమ్మ ఆదర్శ కమిటీ సమావేశం


నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

జక్రాన్ పల్లి మండలం పడకల్ గ్రామంలో పాఠశాలలో అమ్మ ఆదర్శ కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కన్వీనర్ ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ పాఠశాలలో చదివే విద్యార్థులకు తాగునీటి సదుపాయము విద్యుత్ సదుపాయము మరుగుదొడ్డి సదుపాయము కల్పించాలని సూచించారు. విద్యార్థులకు ప్రాథమిక అవసరాలు తీర్చినట్లైతే వారు ఆరోగ్యంగా ఉండి మంచి చదువులు చదివి దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తారని సూచించారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు వివో ఏ సుమతి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న పలువురు

కాంగ్రెస్‌లోకి భారీ చేరికలు

నవతెలంగాణ-నిజాంసాగర్


కాంగ్రెస్ చేరిన పలువురు

నిజాంసాగర్ మండల కేంద్రంలోనీ బంజారాహిల్స్ తండాకు చెందిన బీఆర్ఎస్ ఎంపిటిసి బిక్యా నాయక్, మాజీవార్డ్ మెంబర్ లక్ష్మి బిజెపి యువ నాయకులు రాకేష్ వీరందరూ కూడా కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ సమక్షంలో కాంగ్రెస్‌లోకి శనివారం చేరారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ మాట్లాడుతూ బంజారా హిల్స్ తాండకు చెందిన 40 కుటుంబాలు కాంగ్రెస్ లోకి చేరాయని ఆయన అన్నారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో జహీరాబాద్ గడ్డమీద మూడు రంగుల జెండా ఎగరడం ఖాయమని ఆయన అన్నారు. మండలంలో అన్ని గ్రామాలలో కాంగ్రెస్ పార్టీలోకి భారీగా చేరికలు జరుగుతున్నాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో తాండవాసులు తదితరులు పాల్గొన్నారు.